మాస్టారి ఇల్లే మ్యూజియం



- ఉపాధ్యాయుని ఇంట పురాతన కళాఖండాలు
- ఇత్తడి, రాగి, తగరంతో చేసిన అరుదైన వంటపాత్రలు, పలు రకాల వస్తువులు
- గ్రామఫోన్, పాటల రికార్డులు, టెలిఫోన్లు, కిరోసిన్ లాంతర్లు
- మ్యూజియం ఏర్పాటే లక్ష్యమంటున్న మాస్టారు

- 8వ పేజీలో

సీసీ కెమెరాలు... ఉన్నా లేనట్టే!

అత్యధిక ప్రాంతాల్లో అలంకారప్రాయమే..

- చాలాచోట్ల పనిచేయని వైనం
- నిర్వహణపై జీవీఎంసీ, పోలీస్ శాఖ నిర్లక్ష్యం
- మరమ్మతుల జోలికి వెళ్లని అధికారులు
- నేరాల నియంత్రణకు అవరోధం
- చాలా కేసుల్లో ఆధారాలు దొరక్కపోవడంతో ముందుకుసాగని దర్యాప్తు



ఇసుకతోట జంక్షన్‌లో నేలవైపు తిరిగి ఉన్న సీసీ కెమెరా

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు	1,700
స్మార్ట్‌సిటీలో భాగంగా జీవీఎంసీ ఏర్పాటుచేసిన సీసీకెమెరాలు	560
ప్రస్తుతం పనిచేయని సీసీకెమెరాలు (అధికారులు అంచనా)	700

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"గంజాయి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ తయారీపై పోలీస్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించాను. నగరంలో ఉన్న సీసీ కెమెరాల్లో సగానికిపైగా పనిచేయడం లేదని చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. గత ఐదేళ్లు సీసీ కెమెరాల నిర్వహణను విస్మరించారు."

- కొన్నాళ్ల కిందట హోం మంత్రి వంగలపూడి అనిత చేసిన వ్యాఖ్య.



కోస్టల్‌బ్యాటరీ వద్ద వేలాడుతున్న సీసీ కెమెరాలు

నగరంలో నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2014లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వంపై, పోలీస్ శాఖపై ఆర్థిక భారం లేకుండా 'మాట్రిక్స్' అనే సంస్థతో ఒప్పందానికి ప్రతిపాదనలు తయారయ్యాయి. మాట్రిక్స్ సంస్థే సీసీ కెమెరాలను కొనుగోలుచేసి, అమర్చడంతోపాటు పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు వాటిని అనుసంధానించేలా... అందుకు ప్రతిఫలంగా నగరంలో ఐదేళ్లపాటు ఆ సంస్థ ఉచితంగా హోర్డింగ్‌లు ఏర్పాటుచేసుకుని ప్రకటనల ద్వారా ఆదాయం సమకూర్చుకునేలా ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం మాట్రిక్స్ సంస్థ దాదాపు ఎనిమిదేళ్ల కిందట నగరంలో పోలీసులు సూచించిన కూడళ్లలో 1,700 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసింది. ఐదేళ్ల తర్వాత వాటి నిర్వహణ నుంచి మాట్రిక్స్ సంస్థ తప్పుకుంది. అలాగే స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో ఎల్ అండ్ టీ సంస్థ నగరంలో 560 చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటుచేసింది. వాటి యాక్సెస్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సిటీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసింది. ఎల్ అండ్ టీ సంస్థతో జీవీఎంసీ చేసుకున్న ఒప్పందం కొన్నాళ్ల కిందట ముగిసింది. దీంతో జీవీఎంసీయే చూస్తోంది. అయితే కొత్తగా వేరే సంస్థతో ఒప్పందం కుదరకపోవడంతో వాటి నిర్వహణ గాలికి వదిలేసినట్టయ్యింది. ప్రస్తుతం జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 560 సీసీ కెమెరాల్లో దాదాపు 200 కెమెరాలు, మాట్రిక్స్ సంస్థ ఏర్పాటుచేసిన



బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ వద్ద తుప్పుపట్టిన సీసీ కెమెరాలు

... మిగతా 6వ పేజీలో

విప్‌లుగా ఇద్దరు

- ఎమ్మెల్యే పి.గణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవిరావుకు అవకాశం



పి.గణబాబు



చిరంజీవిరావు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరికి ప్రభుత్వంలో కీలక పదవులు లభించాయి. విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు), ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావులను 'విప్'లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిరువురూ పార్టీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ శాసనసభ/మండలి సమావేశాలు సజావుగా సాగేలా చూడాల్సి ఉంటుంది. అలాగే ఏదైనా అంశంపై ఓటింగ్ ఉన్నప్పుడు తమకు కేటాయించిన సభ్యులు సభకు వచ్చేలా, కీలకమైన చర్చల్లో పాల్గొనేలా చూడాలి. గణబాబు 2014-2019 మధ్య కూడా విప్‌గా ఉన్నారు. చిరంజీవిరావు 2023 ఉత్తరాంధ్ర పట్టభద్ర నియోజకవర్గం నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. తమకు విప్‌గా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గణబాబు, చిరంజీవిరావులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు

విప్‌లకు సహాయ మంత్రి హోదా లభిస్తుంది. ప్రభుత్వం ఎర్ర బుగ్గ లైటుతో అధికారిక వాహనం సమకూరుస్తుంది. అలాగే ఆఫీసు, నిర్వహణకు సిబ్బందిని అందిస్తుంది. సభలో తీర్మానాలు ప్రవేశపెట్టడానికి, చర్చ లేవదీయడానికి, సవరణలు ప్రతిపాదించడానికి అవకాశం లభిస్తుంది. ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన సమాచారం, పత్రాలు చూడడానికి అధికారం ఉంటుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించినప్పుడు తగిన ప్రాధాన్యం లభిస్తుంది. కీలక సమావేశాలు నిర్వహించినప్పుడు ఆహ్వానం ఉంటుంది.

సాకారం కాని సీ ప్లేన్

- విశాఖలో ఎనిమిదేళ్ల క్రితమే ప్రతిపాదన
- మంగమారిపేటలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణానికి నాటి సీఎం చంద్రబాబునాయుడు ఆదేశం
- రెండేళ్ల క్రితం విశాఖపట్నం పోర్టు ప్రతిపాదన
- కార్యరూపం దాల్చని ప్రాజెక్టు
- పర్యాటక శాఖ నిర్లక్ష్యమే కారణం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో పర్యాటక శాఖ నిద్దరోతోంది. పర్యాటకులను రప్పించే కొత్త ఆలోచనలు ఏమీ చేయడం లేదు. పాత ప్రతిపాదనలను కూడా పట్టించుకోవడం లేదు. గత వారం రోజులుగా 'సీ ప్లేన్' గురించి రాష్ట్రంలో చర్చ జరుగుతోంది. విజయవాడ నుంచి శ్రీశైలానికి తొలి సీ ప్లేన్‌ను విజయవంతంగా నడిపారు. సీ ప్లేన్‌లో పది మంది నుంచి 20 మందిని ఒకేసారి తీసుకువెళ్లే సౌలభ్యం ఉంది. దీనిని ఇతర ప్రాంతాల్లో కూడా నడుపుతామని కేంద్ర విమానయాన శాఖా మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు.

వాస్తవానికి సీ ప్లేన్ నడపాలనే ప్రతిపాదన విశాఖపట్నంలో ఎనిమిదేళ్ల క్రితమే వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో 2016 జనవరిలో ఇక్కడ జరిగిన సీఐఐ పెట్టుబడిదారుల సదస్సులో దీనిపై చర్చ జరిగింది. చెన్నైకు చెందిన స్కై చాపర్స్ అనే సంస్థ విశాఖపట్నంలో హెలికాప్టర్లతో పాటు సీ ప్లేన్లను కూడా నడుపుతామని ముందుకువచ్చింది. భీమిలి తీరం నుంచి విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్ నడుపుతామని ప్రకటించింది. ఆ తరువాత జరిగిన చర్చల ఫలితంగా వుడా (వీఎంఆర్‌డీఏ) హెలీ టూరిజం నిర్వహించింది. బసంత్‌కుమార్ కమిషనర్‌గా ఉన్నప్పుడు వుడా పార్కు నుంచి రుషికొండ వరకు హెలికాప్టర్ నడిపారు. కొద్దిరోజులు నడిపిన తరువాత తూర్పు నౌకాదళం రక్షణపరమైన అభ్యంతరం వ్యక్తం చేయడంతో నిలిపివేశారు. ఆ సమయంలోనే పర్యాటక సంస్థలతో సమావేశం నిర్వహించగా, చంద్రశేఖర్ అనే పారిశ్రామికవేత్త సీ ప్లేన్ నడుపుతామని ఆసక్తి వ్యక్తంచేశారు. తమకు భీమిలి సమీపాన మంగమారిపేటలో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మిస్తే సీ ప్లేన్ నడుపుతామన్నారు. ఈ నేపథ్యంలో మూడు నెలల్లో ఫ్లోటింగ్ జెట్టీ నిర్మించాలని 2016లోనే చంద్రబాబు ఆదేశించారు. అది కూడా కార్యరూపం దాల్చలేదు.

రెండేళ్ల క్రితం విశాఖ పోర్టు ప్రతిపాదన

విశాఖపట్నం పోర్టు కూడా సీ ప్లేన్ నడపడానికి రెండేళ్ల క్రితం డీపీఆర్ సిద్ధం చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉడాన్ పథకంలో దానిని చేర్చాలని నాడు చైర్మన్‌గా ఉన్న కె.రామమోహన్‌రావు పౌర విమానయాన శాఖకు లేఖ ... మిగతా 6వ పేజీలో

నైపుణ్య గణనకు సన్నాహాలు

- స్కిల్ సెన్సెస్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటికే సచివాలయ సిబ్బందికి శిక్షణ పూర్తి
- డేటా సేకరణపై పూర్తిస్థాయిలో అవగాహన
- ఈ నెల మూడో వారం నుంచి ప్రారంభమయ్యే అవకాశం
- ఎవరికి వారే తమ వివరాలు అప్‌లోడ్ చేసుకునేందుకు చాన్స్



నైపుణ్య గణన చేయనున్న సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు నైపుణ్య గణన చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. స్కిల్ సెన్సెస్ కోసం అవసరమైన శిక్షణను ఇప్పటికే అధికారులు పూర్తిచేశారు. నగర పరిధిలోని జోన్లు, గ్రామీణ ప్రాంతంలోని మండలాల నుంచి ఎంపిక చేసిన 30 మంది సచివాలయ సిబ్బందికి, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖకు చెందిన మరో 22 మందికి గడిచిన నెలలో మాస్టర్ ట్రైనర్స్‌గా విజయవాడ నుంచి వచ్చిన ఉన్నతాధికారి శిక్షణ ఇచ్చారు. ఈ మాస్టర్ ట్రైనర్స్ ఈ నెల 4, 5, 6 తేదీల్లో జిల్లాలోని 4,529 మంది సచివాలయ సిబ్బందికి మండల, జోనల్ కార్యాలయాల్లో నైపుణ్య గణనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తికావడంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే క్షేత్రస్థాయిలోకి వెళ్లేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం ఈ నెల మూడో వారం నుంచి నైపుణ్య గణనను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.


రెండు విధాలుగా డేటా సేకరణ

నైపుణ్య గణన రెండు రకాలుగా జరుగుతుంది. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సంబంధిత సమాచారం సేకరిస్తారు. అదేవిధంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్...అంటే ఎవరికి వారే తమ వివరాలను ఇవ్వడం. ఈ గణనలో భాగంగా 15 నుంచి 59 ఏళ్లలోపు వయసున్న ప్రతి ఒక్కరి వివరాలను సేకరించనున్నారు. ఇంటింటికీ వెళ్లనున్న సచివాలయ సిబ్బంది...15-59 ఏళ్ల మధ్య ఉన్న వారి ఆధార్‌లో ఉన్న వివరాలు (డెమోగ్రాఫిక్ ప్రొఫైల్), ఆ తరువాత విద్యార్హతలు, నైపుణ్య సమాచారం తీసుకుంటారు. ప్రస్తుత స్థితి అంటే ఉద్యోగం చేస్తున్నారా?, ఇతర పనులు చేస్తున్నారా..? వంటి విషయాలు తెలుసుకుంటారు. వాటిని సిబ్బందికి ప్రత్యేకంగా అందించిన 'నైపుణ్య' అనే యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఇది ఇంటింటికీ వచ్చి సిబ్బంది చేపట్టే నైపుణ్య గణన. ఇక, రెండోది ఎవరికి వార్లే నైపుణ్య గణనకు సంబంధించిన వివరాలను అందించే ... మిగతా 6వ పేజీలో

ఉక్కుకు ఐరన్‌ఓర్ కొరత

ఎన్‌ఎండీసీ నుంచి అరకొర సరఫరా

- ఎంఓయూ పక్కనపెట్టి ప్రైవేటుకు ప్రాధాన్యం ఇస్తున్న జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ
- ఇతరచోట్ల నుంచి తెప్పించుకోవలసిన పరిస్థితి
- పెరుగుతున్న ఉత్పత్తి వ్యయం
- ముడిసరకు లేక పూర్తిస్థాయి ఉత్పత్తికి దూరంగా కర్మాగారం
- సెయిల్‌లో విలీనమే పరిష్కారమంటున్న నిపుణులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఐరన్‌ఓర్ కొరత పెద్ద సమస్యగా పరిణమించింది. స్టీల్ తయారీకి అత్యంత ప్రధానమైన ముడిసరకు అదే. ఇక్కడికి సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌లో భారీమొత్తంలో ఐరన్‌ఓర్ నిక్షేపాలున్నాయనే కారణంతోనే విశాఖపట్నంలో స్టీల్‌ప్లాంటు ఏర్పాటుచేశారు. ఈ గనులు జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్‌ఎండీసీ) ఆధీనంలో ఉన్నాయి. అది కూడా ప్రభుత్వ సంస్థే. ఐరన్‌ఓర్ సరఫరాకు ఎన్‌ఎండీసీతో విశాఖపట్నం స్టీల్‌కు అవగాహన ఒప్పందం ఉంది. దానిప్రకారం ఎంత కోరితే అంత సరఫరా చేయాలి. కానీ ఐదేళ్లుగా గణాంకాలు పరిశీలిస్తే సగటున డిమాండ్‌లో 64 శాతమే అందిస్తోంది. దాంతో ఇక్కడ పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగడం లేదు.

వాస్తవానికి 2007 వరకూ ఎన్‌ఎండీసీకి అతిపెద్ద ఖాతాదారు విశాఖపట్నం స్టీల్‌ప్లాంటే. ఆ తరువాత ప్రైవేటు రంగంలో స్టీల్‌ప్లాంట్లు రావడంతో వారికి సరఫరా ప్రారంభించింది. ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు తాయిలాలు ఇవ్వడంతో వారికి ప్రాధాన్యం ఇస్తూ విశాఖ స్టీల్‌కు క్రమంగా సరఫరా తగ్గించేసింది.

అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏడు మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మరో స్టీల్‌ప్లాంటు రానుంది. దానికి కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బైలదిల్లా గనుల నుంచే ఐరన్‌ఓర్ సరఫరా జరుగుతుంది. అది ప్రారంభమైతే విశాఖ ఉక్కుకు ఐరన్‌ఓర్ సమస్య మరింత తీవ్రతరమవుతుందనే ఆందోళన కార్మికుల్లో ఉంది. ఈ ఇబ్బందులు ఎదురుకాకూడదనే సొంత గనులు కేటాయించాలని స్టీల్ యాజమాన్యం, కార్మిక సంఘాలు కొన్ని దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాయి.

ఐదేళ్లలో విశాఖ స్టీల్‌కు ఐరన్‌ఓర్ సరఫరా జరిగిన తీరు (లక్షల టన్నుల్లో)

సంవత్సరం	డిమాండ్	బైలదిల్లా	కర్ణాటక	ఇతరాలు	మొత్తం	సరఫరా
2019-20	114.7	72.62	1.54	7.04	81.21	71%
2020-21	98.36	59.8	1.59	6.41	67.81	69%
2021-22	131.5	86.8	7.26	0.11	94.17	72%
2022-23	104.25	65.82	0.83	0.43	67.09	64%
2023-24	138.65	66.29	1.74	1.19	69.22	50%
2024-25 (అక్టోబరు వరకు)	60.74	32.87	0.31	0.12	33.3	55%
మొత్తం	647.57	348.20	13.28	15.30	412.79	64%

అక్కడ ఉన్నది రెండే లైన్లు

ఛత్తీస్‌గఢ్ గనుల నుంచి ఐరన్‌ఓర్‌ను విదేశాలకు ఎగుమతి చేయడానికి కొండల మీదుగా రెండు రైల్వే లైన్లు మాత్రమే ఉన్నాయి. వర్షాలు కురిసినప్పుడు కొండ చరియలు విరిగి పడి రైళ్ల రాకపోకలు నిలిచిపోతుంటాయి. ఆ సమయంలో ఐరన్‌ఓర్ రవాణా ఆగిపోతుంది. అప్పుడు ఇతర ప్రాంతాల నుంచి విశాఖ స్టీల్ యాజమాన్యం ఐరన్‌ఓర్ సమకూర్చుకుంటుంది. ఒక్కోసారి ఎన్‌ఎండీసీ అధికారులే ఐరన్‌ఓర్ అందించలేమని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ముందుగానే చెప్పేస్తుంటారు. ఆ సమయంలో కర్ణాటకలోని రంజిత్‌పురా నుంచి ఐరన్‌ఓర్ రప్పిస్తారు. దీనివల్ల ... మిగతా 6వ పేజీలో

గుణుపూర్ ఎక్స్‌ప్రెస్ తాత్కాలిక రద్దు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ, గుణుపూర్ సెక్షన్‌లో పనులు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖ-గుణుపూర్ మధ్య నడిచే 08522, 08521 నంబర్లు గల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 13, 16, 17, 20, 23, 24 తేదీల్లో రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రూర్కెలా-గుణుపూర్ రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ (18117) ఈ నెల 12, 15, 16, 19, 22, 23 తేదీల్లో రూర్కెలా నుంచి పలాస వరకు, తిరుగు ప్రయాణంలో 18118 నంబర్లు గల రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17, 20, 23, 24 తేదీల్లో పలాస నుంచి బయలుదేరి రూర్కెల్ చేరేలా గమ్యాలను కుదించామని పేర్కొన్నారు.

ఆ సైలెన్సర్లు విక్రయిస్తే చర్యలు

- వ్యాపారులకు సీఐ హెచ్చరిక

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

నగరంలో శబ్ద కాలుష్యానికి కారణమయ్యే ఎగ్జాస్ట్ సైలెన్సర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని ద్వారకా నగర్ స్టేషన్ ట్రాఫిక్ సీఐ కేఎస్ఎస్‌వీ ప్రసాద్ హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలకు అధిక ... మిగతా 6వ పేజీలో

హెచ్‌ఎంలకు భారంగా పాఠశాలల నిర్వహణ

- నిర్వహణకు నిధులు ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం
- విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదన్న నాటి విద్యా శాఖా మంత్రి
- ప్రస్తుత విద్యా సంవత్సరానికి గ్రాంటు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- విద్యుత్ బిల్లులు కూడా చెల్లించాలంటున్న ఈపీడీసీఎల్ అధికారులు
- బడ్జెట్ సరిపోదంటున్న ప్రధానోపాధ్యాయులు



విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి):

పాఠశాలల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా పరిణమించింది. ప్రధానంగా విద్యుత్ బిల్లుల చెల్లింపు చాలా కష్టంగా ఉంది. వైసీపీ పాలకులు గత విద్యా సంవత్సరంలో పాఠశాలల నిర్వహణకు పైసా విడుదల చేయలేదు. అంతకు ముందు విద్యా సంవత్సరం అంటే 2022-23లో 20 శాతం నుంచి 30 శాతమే స్కూలు గ్రాంటు విడుదల చేసిన వైసీపీ సర్కారు సకాలంలో ఖర్చు చేయని పాఠశాలల నుంచి వెనక్కి తీసుకుంది. పరీక్షల నిర్వహణ, ఇతర బిల్లులు, నివేదికలకు అవసరమైన స్టేషనరీ ఖర్చు, ఇంటర్నెట్ బిల్లులు, టాయిలెట్స్‌లో పైపులు, ట్యాపులు, మోటారు మరమ్మతులకు ప్రతినెలా ఎంతో కొంత ఖర్చవుతుంది. దీనికితోడు పాఠశాలను బట్టి విద్యుత్ బిల్లు రూ.రెండు వేల నుంచి రూ.20 వేల వరకూ వస్తుంటుంది. రాష్ట్రంలో అతి పెద్ద పాఠశాలగా గుర్తింపుపొందిన చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకు సగటున రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు విద్యుత్ బిల్లు వస్తోంది. పాఠశాల నిర్వహణ ఖర్చు మరో రూ.20 వేల వరకూ అవుతుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు చెల్లించలేమని ... మిగతా 6వ పేజీలో

చందన అలంకరణలో ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి



భీమునిపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని శ్రీఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు చందనాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు, వారి శిష్యబృందం ఆధ్వర్యంలో స్వామివారి అలంకరణ సేవ జరిగింది. మంగళవారం నుంచి గురువారం రాత్రి వరకూ స్వామివారు చందన అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, శ్రీరామచంద్రమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు, ఉసిరికల తాతాజీ పాల్గొన్నారు. అలాగే భీమిలి కృష్ణా కాలనీ వేంకటగిరిపై కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు పర్యవేక్షణలో చందన అలంకరణ సేవ చేపట్టారు. ఈ నెల 12, 13 తేదీల్లో స్వామివారు చందన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, నాయకులు చంద్రమూర్తి, సత్యానందరావు, ముత్యాలరావు, పెదబాబు, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ఆనందపురం, నవంబరు (ఆంధ్రజ్యోతి) 12 : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ బీవీఎస్ అప్పారావు మంగళవారం తెలిపారు. 14న జాతీయ పతాకావిష్కరణ నిర్వహించి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. 15న పుస్తక ప్రదర్శన, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 16న కవి సమ్మేళనం, హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 17న గ్రంథాలయ రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను స్మరించడం, 18న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చెప్పడం, కథలు రాయడం, మ్యూజికల్ చైర్ పోటీలు, 19న భారతదేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మహిళా దినోత్సవం, 20న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భీమిలిలో రాగులు కొనుగోలు కేంద్రం

» జిల్లా వ్యవసాయశాఖ అధికారి అప్పలస్వామి

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయదారులకు సదుపాయం, గిట్టుబాటు ధరలు అందించడానికి భీమిలి రూరల్ మండలంలో రైతుల కోసం రాగుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అధికారి పి.అప్పలస్వామి తెలిపారు. మంగళవారం మండలంలో సింగనబంద, నారాయణరాజుపేట గ్రామాల్లో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ రాగుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల దళారుల బాధ ఉండదని, తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. మండలంలోని రైతులు చిరుధాన్యాలు సాగుకు ముందుకు రావాలని కోరారు. రాగుల కనీస మద్దతు ధర రూ.4290గా నిర్ణయించినట్టు తెలిపారు. ఏవో బి.కోమలి అధ్యక్షత మాట్లాడుతూ రాగుల పంటకు సంబంధించి వేగావతి, ఇంద్రావతి రకాలకు చెందిన విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయయన్నారు. సమావేశానికి హాజరైన రైతుల సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. పంట పొలాలను పరిశీలించారు. ఈ సమావేశంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది హరీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



'పొలం పిలుస్తోంది'లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

'ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ కోసం కృషి'



ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న శ్రీనివాసులనాయుడు

భీమునిపట్నం (రూరల్), నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు లెర్చరర్లుగా పదోన్నతులు కల్పించేందుకు సర్వీసు రూల్స్ కోసం తన వంతు కృషి చేస్తాననని మాజీ ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులనాయుడు పేర్కొన్నారు. మంగళవారం భీమిలి మండలంలో తాటితూరు తాళ్లవలస, మజ్జివలస, లక్ష్మీపురం, చిప్పాడ మజ్జిపేట, అమనాం, తాళ్లవలస, చిట్టివలస తదితర ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షను విధానాన్ని రద్దు చేయడానికి కూడా తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఓటర్ల నమోదులో ఉపాధ్యాయులందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శ్రీను, ప్రచార కార్యదర్శి మురళీ, మండల గౌరవాధ్యక్షులు కనకల సన్యాసినాయుడు, జమ్ము అప్పలనాయుడు, రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా దుర్గారావు



మధురవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కళింగ కార్పొరేషన్ డైరెక్టరుగా మధురవాడకు చెందిన మామిడి దుర్గారావు నియమితులయ్యారు. జీవీఎంసీ 7వ వార్డుకు చెందిన దుర్గారావు ప్రస్తుతం తెలుగు యువత అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా భీమిలి నియోజకవర్గం నుంచి కళింగ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులయ్యారు. తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిన తెలుగుదేశం పార్టీ అధిష్ఠానికి, భీమిలి నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, చిక్కాల విజయబాబు తదితరులకు దుర్గారావు కృతజ్ఞతలు తెలిపారు.

కావ్యపూర్ణిమకు ఆర్కిటెక్చర్‌లో పీహెచ్‌డీ

» డిగ్రీ చేస్తుండగా చూపు కోల్పోయినప్పటికీ పట్టుదలతో ముందుకు..

మధురవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐజీహెచ్ వారియర్స్ ఇండియా ఫౌండర్, జిల్లా దివ్యాంగుల కమిటీ ఎక్స్‌పర్ట్ బలిజేపల్లి కావ్యపూర్ణిమకు పరిస్థితి అనుకూలించకన్నప్పటికీ అరుదైన ఘనత సాధించారు. మధురవాడలోని మిథిలాపురి వుడా కాలనీకి చెందిన కావ్య ముంబై యూనివర్సిటీ నుంచి బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ తృతీయ సంవత్సరం చదువుతుండగా, నాడీమండలంలో ఏర్పడిన సమస్య కారణంగా 98 శాతం చూపు కోల్పోయింది. అయినప్పటికీ చదువు కొనసాగించింది. ఆమె నేషనల్ సెంటర్ ఫర్ డిసేబుల్డ్ పీపుల్ (ఎన్సీపీడీపీఈ) జావేద్ అబీది ఫెలోషిప్-2021 కు ఎంపికైంది. ఈ ఫెలోషిప్ కు దేశ వ్యాప్తంగా 25 మంది ఎంపికవగా, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కావ్యపూర్ణిమ ఒక్కరే ఈ ఘనత దక్కించు కోవడం విశేషం. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో కావ్యపూర్ణిమ మూడేళ్ల పాటు అందరికీ అనుకూలమైన భవన, రవాణా, పర్యాటక స్థల నిర్మాణ కట్టడాలపై పరిశోధన చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన స్నాతకోత్సవంలో ఎంపీహెసిస్ సంస్థ గ్లోబల్‌హెడ్ , ఉపాధ్యక్షురాలు దీపానాగరాజ్ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. కావ్యపూర్ణిమకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు అభినందించారు.



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కావ్య పూర్ణిమ

అనంతుని క్షేత్రంలో ఏకాదశి పూజలు

పద్మనాభం, నవంబరు12 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంతపద్మనాభుడి క్షేత్రంలో కార్తీక మాసం ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు అనంతునికి, కుంతీమాధవస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అనంతుడు, కుంతీమాధవస్వామి, లక్ష్మీదేవిలను దర్శించుకొని విశేషార్చనలు చేయించారు. నారాయణేశ్వరస్వామి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు జరిపారు.

భక్తులతో హరిహరుల క్షేత్రాలు కిటకిట



దర్శనానికి బారులుదీరిన భక్తులు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాస శుక్లపక్ష ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం పలు హరిహరుల క్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వరాహ లక్ష్మీనృసింహస్వామి, సింహగిరి క్షేత్ర పాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి, కొండదిగువ తొలి పావంచా వద్ద దైవతామూర్తులను, 98వ వార్డులోని పాత అడివివరం, విజినిగిరిపాలెం, కాపువీధి, సింహపురి కాలనీలోని పలు శివాలయాలకు వేకువజాము నుంచే భక్తుల తాకిడి నెలకొంది. అలాగే దేవస్థానం కొండదిగువ పూదోటలో కొలువుదీరిన పద్మావతి, అలిమేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి సూర్యోదయం నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒకదశలో వెంకన్న దర్శనానికి భక్తుల క్యూ చేంతాడంత పెరిగిపోయింది.

సీసీ కెమెరాలు.. ఉన్నా లేనట్టే!

... 5వ పేజీ తరువాయి

1,700 కెమెరాల్లో 500 వరకూ పనిచేయడం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. బీచ్‌రోడ్డుతోపాటు నగరంలోని కీలక ప్రాంతాలు, కూడళ్లలోని సీసీ కెమెరాలు తుప్పుపట్టిపోగా, మరికొన్నిచోట్ల బోల్టులు ఊడి, స్టాండ్‌లు విరిగి గాలిలో వేలాడుతున్నాయి. ఏ క్షణానైనా వైరు తెగి కింద నుంచి వెళ్లే వాహనచోదకుల పైనా, పాదచారులపైనా పడిపోయేలా ఉన్నాయి.

నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రభావం

నగరంలో సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడం నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రభావం చూపుతోంది. ఎక్కడైనా చోరీ, దోపిడీ జరిగినా, కిడ్నాప్‌లు, మిస్సింగ్ కేసులు నమోదైతే వాటికి సంబంధించిన ఆధారాలను సమీపంలోని సీసీ కెమెరాల నుంచి పోలీసులు సేకరించేవారు. దీనివల్ల కేసుల ఛేదన సులభమయ్యేది. అలాగే ఎక్కడైనా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడినా, రోడ్డు ప్రమాదాలు జరిగినాసరే పోలీసులు కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించి సమీపంలోని ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేసి అక్కడకు పంపించేవారు. దీనివల్ల సత్వరం ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలు 30 శాతానికిపైగా పనిచేయకపోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. సీసీ కెమెరాల నిర్వహణపై పోలీస్, జీవీఎంసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టిసారిస్తేగానీ గంజాయి రవాణా, వినియోగం, ఈవ్‌టీజింగ్, చోరీలు, నేరాల నియంత్రణకు వీలుంటుందని సిబ్బంది అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

డిసెంబరు 31 నాటికి సమస్య పరిష్కరిస్తాం

-శంఖబ్రతబాగ్చి, నగర పోలీస్ కమిషనర్

నగరంలో సీసీ కెమెరాల మరమ్మతు, కొత్త సీసీ కెమెరాల ఏర్పాటుపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో ఇటీవలే చర్చించడం జరిగింది. సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చేయడంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడానికి జీవీఎంసీ కమిషనర్ అంగీకరించారు. వచ్చేనెల 31వ తేదీ నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని కూడళ్లలో ప్రమాదాల నియంత్రణకు రోడ్ల డిజైన్‌లో మార్పులు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.

ఉక్కుకు ఐరన్‌ఓర్ కొరత

... 5వ పేజీ తరువాయి

టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు రవాణా వ్యయం పెరుగుతుంది. ఇది ప్లాంటుకు ఆర్థిక భారం. కొంతకాలంగా బైలదిల్లా నుంచి జిందాల్, మిట్టల్ సంస్థలు పెద్దఎత్తున ఐరన్‌ఓర్‌ను కొనుగోలు చేసి తరలించుకుపోతున్నాయి. ఆయా యాజమాన్యాలు ఉన్నత స్థాయిలో లాబీయింగ్ చేయడంతో విశాఖ స్టీల్‌ను పక్కనపెట్టి, వారికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బైలదిల్లాలోని ఐరన్‌ఓర్ నాణ్యమైనది కావడంతోనే డిమాండ్ ఎక్కువ. దీనికితోడు రైల్వే అధికారులు కూడా పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. ఉక్కు కర్మాగారానికి ఐరన్‌ఓర్ రవాణా చేసేందుకు అవసరమైనన్ని ర్యాకులు (గూడ్సు రైళ్లు) కేటాయించడం లేదు. రోజుకు ఐదు ర్యాకులు పంపాల్సి వస్తే మూడే ఇస్తున్నారు. ఇది కూడా సమస్యగా మారింది.

సెయిల్‌లో విలీనమే పరిష్కారం

విశాఖ ఉక్కు సమస్యల నుంచి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపడం లేదు. సొంత గనులు కేటాయించడం లేదు. కనీసం సొంత గనులున్న స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సెయిల్‌కు నాలుగు ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ గనులున్నాయి. అందులో విలీనం చేస్తే విశాఖ స్టీల్‌కు సమస్య ఉండదు. సెయిల్ గనుల నుంచి ఐరన్‌ఓర్ వస్తుంది.

సాకారం కాని సీ ప్లేన్

... 5వ పేజీ తరువాయి

రాశారు. సీ ప్లేన్‌కు అవసరమైన జెట్టీ నిర్మిస్తామని ప్రకటించారు. అప్పటికే పోర్టు క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం సగం పూర్తిచేసింది. ఇప్పుడైతే ఆ టెర్మినల్ ఆపరేషన్‌కు సిద్ధంగా ఉంది. క్రూయిజ్‌లు ఎలాగూ రావడం లేదు. కనీసం సీ ప్లేన్ అయినా నడిపితే బాగుంటుంది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ, శ్రీశైలం, హుస్సేన్ సాగర్ (హైదరాబాద్), చిలకా సరస్సు (ఒడిశా), తిరుపతి వంటి ప్రాంతాలకు డిమాండ్ ఉంటుంది.

సీ ప్లేన్ నీటిపైనా, భూమిపైనా ల్యాండ్ అవుతుంది. అలాగే టేకాఫ్ ఎక్కడి నుంచైనా తీసుకోగలుగుతుంది. లోకల్ టూరిజం కింద విశాఖపట్నం నుంచి రుషికొండ, భీమిలి, అరకులోయ, లంబసింగి, పొరుగునే ఉన్న అరసవిల్లికి కూడా నడపొచ్చు. అయితే జిల్లా పర్యాటక శాఖ అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇక్కడ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ పోస్టు, ఏపీటీడీసీలో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ బాధ్యతలన్నీ ఒక్కరికే అప్పగించారు. ఆ శాఖను సంస్కరించాలని ప్రజా ప్రతినిధులు కూడా ఆలోచించడం లేదు.

గిరిజన మ్యూజియం వద్ద విలువిద్య పోటీలు

సాగర్‌నగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రుషికొండ ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీసీఆర్ అండ్ టీఎం) వద్ద మంగళవారం విలువిద్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ఐటీడీఏల పరిధిలో గల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. టీసీఆర్‌అండ్‌టీఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రాణిమంద పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. ఈ నెల 30 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు కేరళలోని వాయినాడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు ఇక్కడ పోటీల్లో అర్హత సాధించిన నలుగురిని పంపిస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పద్మనాభం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతవరంలోని కోళ్లఫారం దగ్గర ఆటోలో అక్రమంగా రవాణా చేస్తున్న 800 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. బియ్యం రవాణా చేస్తున్న టి.అప్పలరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆటోతో పాటు బియ్యాన్ని సీజ్ చేశామన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. మంగళవారం సింహాచల ప్రధాన కూడలిలోని మార్కెట్‌కు చెందిన పలువురు పార్టీ సభ్యత్వాలను స్వీకరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బంతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నాయకుల నిరసన

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలనే డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకుడు ముద్దాడ ప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం వార్డులోని కాపువీధి సచివాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని విద్యుత్ చార్జీలను తగ్గించడంతో పాటు నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. విద్యుత్ చార్జీల దరువుతో పేదలతో పాటు మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మతం అంటే సనాతన ధర్మం

రామకృష్ణ మిషన్ స్వామి విద్యానంద



సాగర్‌నగర్, నవంబరు 12: మతం అంటే పూజలు, ఆచారాలు, మూఢనమ్మకాలు కాదని సనాతన ధర్మం అని, మతాన్ని శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకోవాలని రామకృష్ణ మిషన్ స్వామి విద్యానంద అన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జేఎన్‌వీ) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో మంగళవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. విజ్ఞానం (సైన్స్), ధర్మం (రిలీజియన్) మధ్య సంబంధాన్ని వివరిస్తూ... ధర్మం అంటే సమాజంలో విలువలు, శాంతి, నైతిక ప్రవర్తన అని అన్నారు. విజ్ఞాన శాస్త్రం ప్రస్తుతం వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను ఆపలేదని, అయితే సనాతన ధర్మానికి సమాజంలో శాంతిని నెలకొల్పే శక్తి ఉందన్నారు. ధర్మం మనిషి మనసులో సత్యం, అహింస, ఇతరుల పట్ల ప్రేమ, ఉత్తమ మానవ సంబంధాలను నెలకొల్పగలదన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రముఖ భూ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ కేఎస్ కృష్ణ మాట్లాడుతూ సముద్ర శాస్త్ర విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ముఖ్యంగా 2025 నుంచి ప్రారంభం కానున్న భారత ప్రభుత్వ ప్రతిష్టాత్మక సముద్ర యాన్ ప్రాజెక్టు దేశానికి విలువైన వనరులను అందించగలదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఇ.ఉమాపతిరెడ్డి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జవహర్ నవోదయ విద్యాలయ సమితి విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశున్ని దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభం వద్ద ఐటీ సెంట్రల్ ముఖ్య కమిషనర్ డాక్టర్ రాజేంద్రకుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కరుణ

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని మంగళవారం సెంట్రల్ ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ రాజేంద్ర కుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ వాకాటి కరుణ, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, తదితరులు దర్శించుకున్నారు. ప్రముఖులకు ఆలయ పర్యవేక్షణాధికారులు త్రిమూర్తులు, జీవీవీఎస్‌కే ప్రసాద్ ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న అతిథుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు తర్వాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా స్వర్ణ తులసీ దళార్చన

సింహాద్రి అప్పన్న స్వామికి వైభవంగా స్వర్ణతులసీ దళార్చన నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలను పూర్తి చేశాక ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ అష్టోత్తర శతనామార్చనతో స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆ తర్వాత ఇదే వేదికపై సింహచలేశున్ని నిత్య కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్, అధికారులు

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరదల సమయంలో ప్రజలకు విస్తృత సేవలందించిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు జోన్-8 అధికారులు, 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం దుస్తులను పంపిణీ చేశారు. వరదల సమయంలో కార్మికులు అందించిన సేవలు మరువలేనివని ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్సీ కె.హైమావతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇ.వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



మన్యాల సోంబాబుకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు కార్యకర్తలు

ఘనంగా టీడీపీ నాయకుడు సోంబాబు జన్మదిన వేడుకలు

కొమ్మాది, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మన్యాలసోంబాబు జన్మదిన వేడుకలను మంగళవారం ఐదో వార్డులో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మారికవలస శివాలయంలో సోంబాబు ప్రత్యేక పూజలు చేసి అయ్యప్ప భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సోంబాబు మాట్లాడుతూ ఐదో వార్డులో టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు మొల్లి లక్ష్మణరావు, నాగోతి సత్యనారాయణ, నమ్మి శ్రీను, ఈగల రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి: ఎంపీపీ

పద్మనాభం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనలో ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఎంపీపీ కె.రాంబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు-2025-26 తయారీపై మంగళవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సొంత నిధులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులను కూడా జత చేసి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేశ్వరి, విస్తరణాధికారి (పీఆర్ అండ్‌ఆర్‌డీ) మీనాకుమారి, ఏవో జయఉమ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు మృతి

తగరపువలస, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): చిట్టివలస సంతపేటకు చెందిన సీఐటీయూ స్థానిక నాయకుడు బాకి రాజబాబు (60) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. చిట్టివలస జూట్‌మిల్లు పోరాటాల్లో సీఐటీయూ కార్మిక నాయకునిగా ఆయన పాల్గొన్నట్టు పలువురు నాయకులు తెలిపారు ఆయన మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆ సైలెన్సర్లు విక్రయిస్తే చర్యలు

... 5వ పేజీ తరువాయి

శబ్దం వెదజల్లే ఎగ్జాస్ట్ సైలెన్సర్లు విక్రయించే వ్యాపారులతో స్టేషన్ ఎదురుగా సీటీఐ డౌన్‌లో ఉన్న రాయుడు కళ్యాణమండపంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వంద డెసిబెల్స్ దాటిన సైలెన్సర్లు వినియోగించడం చట్టరీత్యా నేరమని, అలాంటి సైలెన్సర్లు విక్రయించేవారు కూడా శిక్షకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 సీఐలు శ్రీను, ఎన్.సాయి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు భారంగా పాఠశాలల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

ప్రధానోపాధ్యాయులు గత పాలకులకు విన్నవించుకున్నారు. ఆ మేరకు పాఠశాలల విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని గత ప్రభుత్వంలో విద్యా శాఖా మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ చెప్పడంతో హెచ్‌ఎంలు ఆ విషయం మరచిపోయారు.

గ్రాంటు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 559 పాఠశాలలకు రూ.91,95,000 గ్రాంటు విడుదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి పూర్తి గ్రాంటు రూ.1,83,90,000. 30 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఏడాదికి రూ.10 వేలు, 30-100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.25 వేలు, 100-250 మంది విద్యార్థులు ఉన్నట్టయితే రూ.50 వేలు, 250 మంది నుంచి 1000 మంది వరకు రూ.75 వేలు, 1000 మంది, అంతకంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు రూ.లక్ష గ్రాంటు కింద విడుదల చేస్తారు. పాఠశాలలో విద్యుత్ బిల్లులు, తాగునీటికి ఆ మొత్తం ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు పెరగడం, ఇంకా తాగునీటి కోసం మోటారు నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. దాంతో మిగిలిన ఖర్చులకు స్కూలు గ్రాంటు సరిపోదని హెచ్‌ఎంలు వాపోతున్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. తాజాగా విడుదల చేసిన గ్రాంటు నుంచి విద్యుత్ బిల్లుకు కొంత మొత్తం వెచ్చించాలి. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు పాత బకాయిలు చెల్లించిన తరువాతే మాత్రమే ప్రస్తుత బిల్లు చెల్లించాలి. బకాయిలు చెల్లించాలంటే ప్రస్తుత గ్రాంటు సరిపోదు. పైగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వాడిన విద్యుత్‌కు మాత్రమే బిల్లు చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి.

దీంతో విద్యుత్ బిల్లుల విషయంలో హెచ్‌ఎంల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఈ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని లేకపోతే పాఠశాలలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. పాఠశాలల నిర్వహణ గ్రాంటు పెంచాలని కోరుతున్నారు.

నైపుణ్య గణనకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులు, విద్యావంతులు, ఉద్యోగాలు చేసేవాళ్లు నైపుణ్య అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వారికి సంబంధించిన వివరాలను ఎంటర్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు. ఈ రెండు పద్ధతుల్లో సేకరించిన వివరాలను విశ్లేషించిన తరువాత ప్రభుత్వం కేటగిరీల వారీగా విభజించి అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది. నైపుణ్యాలను కల్పించిన తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది.

వేగంగా పూర్తిచేసే యోచనలో ప్రభుత్వం

-టి.చాముండేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి



నైపుణ్య గణనను వీలైనంత వేగంగా పూర్తిచేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే సిబ్బందికి శిక్షణను పూర్తిచేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో సెన్సెస్‌ను ప్రారంభిస్తాం. వివరాలు సేకరణ, యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి అంశాలు గురించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన సిబ్బందికి శిక్షణ అందించాం. మాస్టర్ ట్రైనర్స్‌గా డిజిటల్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నైపుణ్య గణనను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఎంపీపీ పాఠశాల

▸ దుర్గవానిపాలెంలో

తీర్చిదిద్దిన జిల్లా విద్యాశాఖ అధికారులు


ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న దుర్గవానిపాలెం ఎంపీపీ స్కూల్

పెదగంట్యాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మండలంలోని దుర్గవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారులు తీర్చిదిద్దారు. పెదగంట్యాడ మండలానికి మోడల్ స్కూల్‌లా దీనిని రూపొందించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, స్కూల్ ప్రాంగణంలోని పచ్చని చెట్లు, అంతటా పరిశుభ్రత వంటివన్నీ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా కనిపిస్తుంది. ఒకటి నుంచి ఐదు తరగతులు ఉన్న ఈ పాఠశాలలో 38 మంది విద్యార్థులతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఒక గ్రాడ్యుయేట్ యువతిని టీచింగ్ సహాయకురాలిగా తీసుకున్నారు. విద్యార్థులకు పాఠాలు బోధించే విధానం, చిన్నారులు చదువుకునే తీరు సంతృప్తికరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ పాఠశాలలో మూడు తరగతి గదులతో పాటు వంటశాల, ప్యూరిఫైడ్ తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్ల సముదాయాలు ఉన్నాయి. వీటికి నిత్యం నీరందించే బోర్‌వెల్‌తో పాటు జీవీఎంసీ కొళాయి ఉంది. ఇక్కడ తరగతులన్నీ ఇంగ్లిష్ మీడియంలోనే జరుగుతాయి. వంటశాలను సిబ్బంది చాలా పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనం ఎంతో రుచికరంగా ఉంటుంది.


పరిశుభ్రమైన వంటశాలలో మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేస్తూ..

విద్యార్థుల తల్లులతో వాట్సాప్ గ్రూప్

పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంపీ సుశీల విద్యార్థుల తల్లులతో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎవరైనా పాఠశాలకు రాకపోయినా, ఒకవేళ ఆలస్యంగా వచ్చినా వెంటనే గ్రూపులో మెసేజ్‌లు పెడుతూ వారి తల్లిదండ్రులను అలెర్ట్ చేస్తుంటారు. స్కూల్‌లో జరిగే ప్రతి అంశాన్ని వాట్సాప్ గ్రూపు ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు చేరవేస్తున్నారు. మండల విద్యాశాఖాధికారి, జిల్లా విద్యాశాఖాధికారి కూడా ఈ గ్రూపులో ఉండడం విశేషం.

టీచింగ్ ఎయిడ్‌ను సమకూర్చుకున్నాం

-ఎంపీ సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు



విద్యార్థులకు పాఠాలను సులభ పద్ధతిలో బోధించేందుకు గాను టీచింగ్ ఎయిడ్‌ను సమకూర్చుకున్నాం. ఇందుకోసం సొంతంగా నగదు వెచ్చిస్తున్నా. విద్యార్థులకు అవసరమైన పెన్నులు, నోట్ పుస్తకాలను ఉచితంగా ఇస్తున్నాం. వాటిని కూడా సొంతంగా సమకూర్చుతున్నా. విద్యార్థులకు మధ్యాహ్నం అందించే భోజనాన్ని కూడా ఎంతో నాణ్యతతో రుచికరంగా తయారు చేయిస్తున్నాం.

పాఠశాల నిర్వాహణ భేష్..

-ఈ.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి



దుర్గవానిపాలెం ఎంపీపీ పాఠశాల నిర్వహణ చాలా బాగుంది. పాఠ్యాంశాలను బోధించడంలో, విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచడంలో, ఎప్పటికప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్ఎం మాట్లాడుతుండడం ప్రత్యేకంగా ఉంటుంది. పాఠశాలలో విద్యార్థుల గైర్హాజరు కూడా చాలా తక్కువగా ఉంటుంది. మధ్యాహ్న భోజన పథకం పరిశీలన నిమిత్తం పాఠశాలకు ఎప్పుడు వెళ్లినా అక్కడే భోజనం చేస్తుంటా. అంత రుచికరంగా ఉంటుంది ఇక్కడి భోజనం.


పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు

సేవకు ప్రతిరూపాలు పారిశుధ్య కార్మికులు

▸ 75వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు

▸ పలుచోట్ల కార్మికులకు దుస్తులు పంపిణీ

పెదగంట్యాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సేవకు ప్రతిరూపాలు పారిశుధ్య కార్మికులు అని 75వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అన్నారు. వికాస్‌నగర్ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం సమకూర్చిన వస్త్రాలను వారికి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడలో వరదల సమయంలో పారిశుధ్య కార్మికులు అక్కడకు వెళ్లి బాధితులకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అగనంపూడి: విజయవాడ వరద ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టిన 79వ వార్డు కార్మికులకు మంగళవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయం కార్యదర్శులు కనకరాజు, గంగునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: విజయవాడ వరదల్లో ఎనలేని సేవలందించిన 40, 63 వార్డుల్లోని పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, గల్లా చిన్నా దుస్తులను అందజేసి సత్కరించారు. విపత్తుల సమయంలో ఎంతో శ్రమించిన పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివని వారు కొనియాడారు. కార్యాక్రమాల్లో పలువురు జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట/ఎన్.ఎ.డి.జంక్షన్: ఇటీవల విజయవాడ వరద ప్రాంతాల్లో సమర్థవంతంగా సేవలందించిన పారిశుధ్య కార్మికులకు 93వ వార్డులోని ఓ కల్యాణ మండపంలో జెడ్సీ కె.హైమావతి, ఏఎంహెచ్‌వో బి.అప్పలనాయుడు, కార్పొరేటర్ రాపర్తి కన్నా వస్త్రాలను పంపిణీ చేశారు. అలాగే 90వ వార్డు జీవీఎంసీ నైట్ షెల్టరులో జరిగిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ దుస్తులను అందజేశారు. కార్యక్రమాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటస్వామినాయుడు, అనంతమూర్తి, బీజేపీ నాయకుడు సత్యనారాయణ, షెల్టర్ నిర్వాహకురాలు మమత, పులిరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో విజృంభిస్తున్న జ్వరాలు

▸ ప్రతి ఇంట్లో ఒకరిద్దరు జ్వర పీడితులే ▸ ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు

గోపాలపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విష జ్వరాలు అధికంగా ప్రబలడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని చాలా కాలనీల్లోని ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. శరీరంపై ఎర్రని దద్దుర్లు, తీవ్రమైన ఒంటి నొప్పులు, ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుముఖం పట్టడం వంటి లక్షణాలతో జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయని బాధితులు వాపోతున్నారు. వీటితో పాటు టైఫాయిడ్ కూడా ఎక్కువగా ప్రబలుతుంది. దీంతో జ్వర పీడితులు ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులకు పెద్దసంఖ్యలో తరలివెళుతున్నారు. అలాగే మెడికల్ టెస్టులు చేయించుకునేందుకు మెడికల్ ల్యాబ్‌ల వద్ద బారులుతీరుతున్నారు. జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైద్య సిబ్బంది చొరవ తీసుకుని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

వైసీపీ సేవలోనే తరిస్తున్న అధికారులు

తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధ అనంతలక్ష్మి


మీడియాతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినా ఇంకా పలువురు అధికారులు వైసీపీ సేవలోనే తరిస్తున్నారని తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి ఆరోపించారు. గాజువాక జోనల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వార్డులోని పలువురు అధికారులు వైసీపీ నాయకులతో కలిసి పర్యటనలు చేస్తున్నారని, కూటమి నాయకులకు కనీసం సమాచారం ఇవ్వడం లేదని మండిపడ్డారు. సమస్యలపై విన్నవించినా సదరు అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వార్డులో సమస్యలు ఉన్నాయని వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదని, వార్డులో పర్యటించాలని కోరినా ఫలితం ఉండడం లేదని పేర్కొన్నారు. అదే వైసీపీ నాయకులు పిలిస్తే మాత్రం అధికారులు పర్యటనలకు వస్తున్నారని విమర్శించారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని గాజువాక జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని ఆమె పేర్కొన్నారు.

ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి సంజీవగిరి కాలనీలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 15 వరకు సభ్యత్వ నమోదుకు ఉందని, అందరూ బీజేపీ సభ్యతాలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సభ్యత్వాలు చేయడం జరిగిందన్నారు. త్వరలో 302 పోలింగ్ బూత్‌లకు కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రంగనాయకులు, కృష్ణారెడ్డి, మనోహర్, రామునాయుడు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు శివాలయ దర్శనానికి భక్తులకు అనుమతి


ఆలయంలోని శివలింగం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల గల శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లేందుకు ఉక్కు యాజమాన్యం అనుమతి ఇచ్చిందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఆలయానికి కార్తీక మాసం మూడు, నాలుగు సోమవారాల్లో భక్తుల దర్శనానికి అనుమతివ్వాలని యాజమాన్యాన్ని కోరడంతో వారు స్పందించి అనుమతి ఇచ్చారన్నారు. అయితే కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డును సీఐఎస్ఎఫ్ సిబ్బందికి చూపించి ప్లాంట్ లోపలకు రావచ్చని, 14 ఏళ్లలోపు వారికి అనుమతి లేదని పేర్కొన్నారు. నాలుగో సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్న సమరాధన జరుపుతామని ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రునాయక్, యేల్లేటి శ్రీనివాసరావులు తెలిపారు.

వైభవంగా సత్తెమ్మతల్లి పండగ



అనంపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి తలారివానిపాలెం రైల్వే ట్రాక్ సమీపంలో గల సత్యెమ్మతల్లి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించారు. స్థానిక బ్రొరమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీదేవి సారె సంబరం

పెందుర్తి-రూరల్, నవంబరు 12: మండలంలోని చింతలఅగ్రహారంలో నిర్వహిస్తున్న శ్రీగౌరీపరమేశ్వరుల ఉత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం గ్రామస్తులు గౌరీదేవికి సారె సంబరం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వివిధ రకాలు స్వీట్లు, తినుబండారాలను ఊరేగింపుగా స్థానిక రామాలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం అక్కడ నుంచి బాణసంచా కాల్పులు, మేళతాళాల మధ్య చింతలఅగ్రహారం పురవీధులతో పాటు లక్ష్మీపురం, గవరపాలెం, దుర్గానగర్ కాలనీల్లో ఊరేగింపు నిర్వహించి సారెను అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపీఅప్పలనాయుడు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు దాడి వరలక్ష్మీఅర్జునరావు, గౌరీ సంఘం నాయకులు మద్దాల శ్రీనివాసరావు, కొణతాల నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

కణితి రోడ్డులో తోపుడు బళ్లు తొలగింపు

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాజువాక కణితి రోడ్డులో తోపుడు బళ్లు, రహదారి పక్కన చిరు వ్యాపారలు చేసే వారిని పోలీసులు తొలగించారు. ఈ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో సుమారు సుమారు వంద అడుగుల మేర రహదారిని విస్తరించారు. దీంతో ఈ మార్గంలో వాహనదారులు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులకు గురికాకుండా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఇటీవల కొంతమంది తోపుడుబళ్ల వ్యాపారులు, చిరు వర్తకులు రోడ్డుపై వ్యాపారాలు సాగిస్తుండడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో పోలీసులు స్పందించి రోడ్డుపై గల వ్యాపారులకు తొలగించారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

పెందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో గల ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్ఐ నరసింగరాజు అన్నారు. మంగళవారం పెందుర్తి, వేపగుంట కూడళ్లలో గల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఆటోలను ఇష్టానుసారంగా నిలపరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సిక్కుల నగర సంకీర్తన

మల్కాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని సిక్కులు తమ మతాచారం ప్రకారం వేకువజాము నాలుగు గంటలకు నగర సంకీర్తన చేపట్టారు. పలువురు సిక్కులు పొడవాటి కర్రకు తమ భక్తిని తెలిపే జెండాను కట్టి భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తనలో పాల్గొన్నారు. సింధియా జంక్షన్ నుంచి మల్కాపురం మహాలక్ష్మి థియేటర్ వరకు పాదయాత్రను చేపట్టారు.

రైతు బజారును పరిశీలించిన ఏడీఎం

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు పరిధి మర్రిపాలెం రైతుబజారులో సబ్సిడీపై విక్రయిస్తున్న ఉల్లిపాయల కౌంటర్లను, స్టాళ్లను జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీఎం మంగళవారం పరిశీలించారు. ఆయా కౌంటర్లలోని తూకాలను, రైతుల కార్డులను ఆయన పరిశీలించారు. ఎవరికి కేటాయించిన స్టాళ్లలో వారే అమ్మకాలు జరపాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **ధూం, ధాం:** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి:** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క:** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర:** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర:** రమాదేవి, శ్రీకన్య (గాజువాక), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 30, క్యారెట్ 48, దొండకాయలు 36, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది)55, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర(కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడికాయలు 100, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	102
ఫారం ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224


ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్న నాయుడుతోట కల్యాణ వేంకటేశ్వరుడు


88వ వార్డు గ్రీన్ సిటీలోని శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద భక్తుల దీపారాధనలు


పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

ఆలయాలకు కార్తీక ఏకాదశి శోభ

పూజలు, దీపారాధనల్లో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం/ఆటోనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం పలు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. వేకువజాము నుంచి ఆయా ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. ఇందులో భాగంగా 71వ వార్డు శ్రీనగర్ శ్రీకృష్ణుని ఆలయంలో, 86వ వార్డు రాజులపాలెం, వుడా కాలనీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, 88వ వార్డు గ్రీన్ సిటీలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయాల్లోని ధ్వజ స్తంభాలు, రావి, వేప చెట్ల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్న సమారాధనలు చేపట్టారు. శ్రీవారి ఆలయాల్లో అన్నమాచార్య భక్తి గీతాలను ఆలపించారు. అలాగే 70వ వార్డు చట్టివానిపాలెంలోని వైకుంఠ నారాయణ అవతార క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వైభవ వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళితో అర్చనలు, పూజలు జరిపారు. శ్రీవారిని బంగారు, వెండి ఆభరణాలు, తులసి మాలలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అగనంపూడి: స్థానిక ఆంజనేయస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా ఆలయాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనన చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణాల్లో విష్ణు, లలితాసహస్రనామ పారయణాలను, హనుమాన్ చాలీసాను భక్తులు పఠించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ నిర్వహించాక అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్‌ను శోభాయమానంగా అలంకరించి హారతులిచ్చారు. భక్తుల గోవింద నామస్మరణలతో వెంకటాద్రి మార్మోగింది.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధిలోని ఎన్ఏడీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, క్షీర, పంచామృతాభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్‌లోని శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి పూజలు, స్వర్ణ పుష్పార్చన, పంచామృతాభిషేకాలు చేశారు. ఏకాహం పేరిట 24 గంటల పాటు భక్తి గీతాలపాలన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


70వ వార్డు చట్టివానిపాలెంలోని శ్రీవారి ఆలయ ఆవరణలో జమ్మి, ఉసిరి, మర్రి ఉసిరి చెట్ల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మల్కాపురం: ఇక్కడి మల్కాపురం మెయిన్‌రోడ్డులో వందేళ్ల చరిత్ర గల రావిచెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలకు వెళ్లి తిరిగి వస్తూ గ్రామ సంప్రదాయం ప్రకారం ఈ చెట్టు వద్ద పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఉదయం నాలుగు గంటల నుంచే చెట్టు చుట్టూ ప్రదక్షణలు చేసి, దీపాలు వెలిగించి మహిళలు పూజలు జరిపారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్‌టీబీఎల్ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఏకాదశి పూజలను వైభవంగా ఈ సందర్భంగ భక్తులతో గీతా పారాయణం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. సీహెచ్ఎం రాజు, విజయలక్ష్మి దంపతులు ఆలయానికి టీవీని బహూకరించారు.

88వ వార్డులో గ్రేటర్ కమిషనర్ పర్యటన

కూర్మన్నపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 88వ వార్డులో మంగళవారం కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడుతో కలిసి పర్యటించారు. దువ్వాడ, ఉప్పర కాలనీ, వెదుళ్లనరవలలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. వార్డులో నెలకొన్న పలు సమస్యలను ముత్యాలనాయుడు కమిషనర్‌కు వివరించారు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సంపత్‌కుమార్ సూచించారు. ఆయన వెంట జోన్-6 జోనల్ కమిషనర్ శేషాద్రి,ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, కూటమి నాయకులు ఉరుకూటి శ్రీను, శ్రీకాంత్, రమణ, రాము, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ హోంగార్డుపై పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ హోంగార్డు విభాగంలో ఎన్‌వీఎస్ నాయుడు విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా మంగళవారం సాయంత్రం బీసీ గేటు సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇక్కడి పెట్రోల్ బంకు సమీపంలో పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన పాల శ్రీను, ఇద్దరు మహిళలు కనిపించారు. వారిని అక్కడ నుంచి వెళ్లాలని ఆయన సూచించారు. దీంతో ఆగ్రహించిన శ్రీను హోంగార్డు కాలర్ పట్టుకుని ముఖంపై బలంగా కొట్టాడు. దీంతో హోంగార్డు అక్కడే పడిపోగా, శ్రీను ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టీల్‌ప్లాంటులో పోస్టు కార్డుల ఉద్యమం

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలంటూ ఉక్కు ఉద్యోగులు మంగళవారం ప్లాంటులో పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పది లక్షల పోస్టు కార్డులను పంపాలని పోరాట కమిటీ నాయకులు నిర్ణయించారు. కర్మాగారంలోని అన్ని విభాగాల కార్మికులు పోస్టు కార్డులపై సంతకాలు చేశారు. అనేక ఉద్యమాల ద్వారా ఏర్పడిన స్టీల్‌ప్లాంటును కాపాడుకునేందుకు పోస్టు కార్డుల ఉద్యమంలో ప్రతిఒక్కరు పాల్గొనవలసిందిగా కార్మిక నాయకులు కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యార్థులకు సూచించిన డీఎస్పీ కె.సత్యనారాయణ

అగనంపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలు వంటి వాటికి దూరంగా ఉండాలని డీఎస్పీ కె.సత్యనారాయణ సూచించారు 85వ వార్డు పరిధి మంత్రిపాలెంలో గల నిస్ట్ కళాశాలలో మంగళవారం సంకల్పం పేరట మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల బంగారు భవిష్యత్తు నాశనమవ్వడమే కాకుండా కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయన్నారు. అందువల్ల విద్యార్థులంతా లక్ష్యాలను ఏర్పరుచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం డీఎస్పీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కృష్ణారావు, ప్రిన్సిపాళ్లు దుర్గినాయుడు, హనీఫ్, నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పెదగంట్యాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను గ్రంథాలయ నిర్వాహణాధికారి పీవీ రమణ మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా 15న చిత్రలేఖనం పోటీలు, 16న గ్రంథాలయోద్యమంలో పాల్గొన్న ప్రముఖులకు నివాళులు అర్పిస్తామన్నారు. అలాగే 17న కవి సమ్మేళనం, మ్యూజికల్ చైర్, పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహిస్తామని, 18న క్విజ్ పోటీలు, 19న ముగ్గుల పోటీలు, మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ జయంతి వేడుకలు, 20న వార్షికోత్సవాల ముగింపు సభను నిర్వహిస్తామన్నారు.

ఓటు ప్రజాస్వామిక హక్కు

పెందుర్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓటు ప్రజాస్వామిక హక్కు అని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రావు అన్నారు. గోపాలపట్నం పవర్ ఆఫీస్ సమీపంలో గల ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులు ఓటర్లుగా నమోదు అయ్యేందుకు గాను అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఓటు విలువను తెలుసుకోవాలని, 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. అనంతరం ఓటింగ్ నమోదు యాప్‌పై అవగాహన కలిగించారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



ఇందిరానగర్‌లో సభ్యత్వం ఇస్తున్న సత్యాడ అప్పారావు, జయశ్రీ

కంచరపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా చేపడుతున్నారు. శ్రీనివాసనగర్, బర్మాక్యాంప్, జైభారత్ నగర్, ఇందిరానగర్, బాపూజీ నగర్ తదితర గ్రామాల్లో ఆయా బూత్ నాయకులు బృందాలుగా ఏర్పడి ఎక్కువ మందికి సభ్యత్వం ఇస్తున్నారు. సీనియర్ నాయకులు గొర్లె అప్పారావు, నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరానగర్-2 గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా గొర్లె అప్పారావు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వంతో ప్రజలకు చక్కని భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యాడ అప్పారావు, తెలుగు మహిళ జయశ్రీ, వడిసెల అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

'అంకితభావంతో పనిచేస్తా'



ఎస్.వరప్రసాద్

మురళీనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ; కాళింగ కార్పొరేషన్ డైరెక్టరుగా తనను నియమించిన టీడీపీ అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తూ, అంకితభావంతో పనిచేస్తానని మాధవధార 50వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సనపల. వరప్రసాద్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మంగళవారం ప్రకటించిన కుల సంఘాల కార్పొరేషన్లలో వరప్రసాద్‌కు చోటు లభించింది. డైరెక్టర్‌గా నియమితులైన ఆయనను పలువురు అభినందించారు.

'కూరగాయల్లో నాణ్యత ముఖ్యం'



నరసింహనగర్ రైతుబజారును సందర్శించిన అధికారి యాసిన్

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు విక్రయించాలని వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ శాఖాధికారి యాసీన్ రైతులను, డ్వాక్రా గ్రూపుల వ్యాపారులను ఆదేశించారు. నరసింహనగర్ రైతుబజారును ఆయన మంగళవారం సందర్శించారు. ఆయన రైతుబజారులోని టమాట, ఉల్లిపాయలు, కూరగాయల స్టాల్స్‌ను, రాయితీపై విక్రయిస్తున్న నూనె ప్యాకెట్లను పరిశీలించారు. నాణ్యత విషయంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. అలాగే ప్రతి ఒక్కరూ గుర్తింపు కార్డు ధరించాలన్నారు. ఈవో పి.చిన్నబాబు, రైతు బజారు సంఘం అధ్యక్షుడు సన్యాసిరావు ఉన్నారు.

నష్టాలను అధిగమించేందుకు కృషి

ఆర్టీసీ ఆర్ఎం


ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో నష్టాలను అధిగమించేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని ఆర్ఎం బి.అప్పలనాయుడు అన్నారు. ద్వారకాకాంప్లెక్సులోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు రోజులో కొంత సమయాన్ని ఫీల్డులో ఉండి, బస్టాపుల్లోనికి ప్రైవేటు వాహనాలు రాకుండా చూడాలన్నారు. దీనివల్ల ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతుందన్నారు. మెకానికల్ ఇంజినీర్లు గ్యారేజీల్లో నిత్యం పర్యవేక్షించాలన్నారు. డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, రాజశేఖర్, డిపోమేనేజర్లు ఎన్ అరుణకుమారి (మద్దిలపాలెం), వి.ప్రవీణ (గాజువాక), కె.సుధాకర్ (వాల్తేరు), కె.రాజశేఖర్ (సింహాచలం), వీబీఎంకే రాజు (మధురవాడ), తిరుపతి, వంశీమోహిని పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులు, విద్యావంతులు, ఉద్యోగులు నైపుణ్య అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వారికి సంబంధించిన వివరాలను ఎంటర్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు. ఈ రెండు పద్ధతుల్లో సేకరించిన వివరాలను విశ్లేషించిన తరువాత ప్రభుత్వం కేటగిరీల వారీగా విభజించి అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది. తరువాత ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది.

వేగంగా పూర్తిచేసే యోచనలో ప్రభుత్వం



నైపుణ్య గణనను వీలైనంత వేగంగా పూర్తిచేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే సిబ్బందికి శిక్షణను పూర్తిచేసింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లాలో సెన్సస్‌ను ప్రారంభిస్తాం. వివరాలు సేకరణ, యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి అంశాలు గురించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన సిబ్బందికి శిక్షణ అందించాం. మాస్టర్ ట్రైనర్స్‌గా డిజిటల్ అసిస్టెంట్స్‌కు శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా నైపుణ్య గణనను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

- టి.చాముండేశ్వరరావు,
జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

దయనీయంగా దండుబజారు మార్గం

- కాలువపైనే మాంసం విక్రయం.. అక్కడే వ్యర్థాలు
- చోద్యం చూస్తున్న శానిటేషన్ విభాగం



దండుబజారు రహదారి చుట్టుపక్కల ఉన్న బడ్డీలు

మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నడిరోడ్డుపైనే మాంసం దుకాణాలతో దండుబజారు రహదారి దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లాలంటేనే ముక్కుమూసుకోవాల్సి వస్తోంది. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన దండుబజారు చేపల బజారు నిరుపయోగంగా మారింది. ఎదురుగానే ఉంటున్న జీవీఎంసీ శానిటేషన్ విభాగం చోద్యం చూస్తోంది. జగదాంబ జంక్షన్ నుంచి జిల్లా పరిషత్, కలెక్టరేట్, కేజీహెచ్‌లకు వెళ్లాలంటే దండుబజారు గుండా ప్రధాన రహదారి ఉంది. దీనికి ఇరువైపులా బడ్డీలు ఏర్పాటు చేశారు. ఇందులో ఎక్కువ శాతం మాంసం విక్రయాలే. ఈ బడ్డీలన్నీ కాలువ మీదనే ఏర్పాటు చేశారు. కోళ్లు, మేకలను అక్కడే కోసేస్తూ, ఆ వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారు. బడ్డీల కింద ఉన్న ఈ కాలువను శుభ్రం చేసే వీలులేక అక్కడే వ్యర్థాలు వదిలేయడంతో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ రహదారి గుండా వెళ్లాల్సిన బాటసారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ ఇబ్బందికర పరిస్థితిపై అనేక మంది ఫిర్యాదు చేస్తున్నా, అక్కడే ఉంటున్న 29వ వార్డు శానిటేషన్ విభాగం అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని స్థానికులు వాపోతున్నారు. దండుబజారు ప్రాంతంలోనే లక్షలాది రూపాయలు వెచ్చించి అన్ని వసతులతో బజారు ప్రాంగణం నిర్మించారు. కాని అందులో ఉండాల్సిన చేపల విక్రయందారులు వీధుల్లోకి వెళ్లి అమ్మకాలు సాగిస్తుండడంతో దండుబజారు మార్కెట్ బోసిపోయి కనిపిస్తోంది. లోపల దుకాణాలు ఖాళీగా ఉంటున్నాయి. అందువల్ల బయట ఉన్న మాంసం దుకాణాలను దండుబజారు లోపలకు తరలిస్తే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పలువురు సూచిస్తున్నారు. రహదారి పక్క బడ్డీలు తొలగిస్తే రాకపోకలకు మార్గం కూడా విశాలంగా ఉంటుందని, ఇలా చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య కొంతవరకు తగ్గుతుందని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్ తదితరులు

మహారాణిపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో పోస్టర్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆవిష్కరించారు. వారోత్సవాలను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రారంభిస్తారు. ఉత్సవాల్లో భాగంగా 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథ పాలకుల సదస్సు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు, దేశభక్తి గేయాలాపన ఉంటాయని పేర్కొన్నారు. 19న మహిళా దినోత్సవం నిర్వహించి వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పించనున్నట్లు జేసీ పేర్కొన్నారు. ముగింపు సభలో విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు, గ్రంథాలయ కార్యదర్శి వెంకటరావు,యోగానంద్ నూకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా కూటమి నేతలు



మధుసూదనరావును అభినందిస్తున్న చంద్రబాబు

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లలో కూట మి నేతలకు డైరెక్టర్లుగా చోటు లభించింది. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అనసూరి మధుసూదనరావు (భీమిలి, టీడీపీ), కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా మామిడి దుర్గారావు (భీమిలి, టీడీపీ), పొన్నాడ రమణారావు(టీడీపీ, పశ్చిమ), సనపల వరప్రసాద్ (టీడీపీ, నార్త్), ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొల్లూరు రూప(జనసేన), అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా క్రిషన్ అంగ (టీడీపీ, గాజువాక)లకు పదవులు దక్కాయి. ఈ సందర్భంగా శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మధుసూదనరావు బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కోరాడ రాజబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పుడు మార్గంలో వాహనాల రాకపోకలు



వ్యతిరేక దిశలో విద్యార్థులతో వస్తున్న స్కూల్ ఆటో

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో వాహనదారులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో సరైన మార్గంలో వస్తున్న వాహనచోదకులు భయాందోళనకు గురవుతున్నారు. తప్పుడు మార్గంలో వస్తున్న వాహనచోదకులు ఎక్కడ ఢీకొడతారోనని భయపడుతున్నారు. ఒకవేళ ఎవరినైనా ఢీకొడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందంటున్నారు. నాలుగు లేన్ల రహదారికి సమీపంలో ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. అందులో చాలా మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉదయం పాఠశాల తెరిచినప్పుడు, సాయంత్రం విడిచిపెట్టే సమయంలో విద్యార్థుల కోసం వారి తల్లిదండ్రులు పాఠశాల వద్ద రోడ్డుపైనే అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. అంతే కాకుండా వారు తప్పుడుమార్గంలో వాహనాలపై వెళ్తున్నారు. విద్యార్థులను తరలిస్తున్న కొన్ని ఆటోలు సైతం వ్యతిరేక దిశలో పయనిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ట్రాఫిక్ పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మోటారు మెకానిక్‌లకు సూచన

మర్రిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ శబ్దం చేసే పరికరాలను ద్విచక్ర వాహనాలకు అమర్చవద్దని ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవరావు మెకానిక్‌లకు సూచించారు. సైలెన్సర్లను ద్విచక్రవాహనాలకు అమర్చడం వల్ల కలిగే దుష్పరిణామాలపై మంగళవారం మాధవధారలోని వుడాకాలనీలో గల జీవీఎంసీ కమ్యూనిటీ హాల్లో మెకానిక్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శబ్ద కాలుష్యంతో వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. హఠాత్తుగా పెద్ద శబ్దంతో వాహనం రావడంతో తోటి వాహనదారులు తీవ్ర ఆందోళన చెంది ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా వాహనదారుడు తమ వద్దకు వచ్చి సైలెన్సర్లను అమర్చమంటే మెకానిక్‌లు తిరస్కరించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు సుమారు వందమంది మెకానిక్‌లు, సీఐలు దాశరథి శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకటరావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ సైలెన్సర్లు విక్రయిస్తే చర్యలు

... 5వ పేజీ తరువాయి

శబ్దం వెదజల్లే ఎగ్జాస్ట్ సైలెన్సర్లు విక్రయించే వ్యాపారులతో స్టేషన్ ఎదురుగా సీటీఐ డౌన్‌లో ఉన్న రాయుడు కళ్యాణమండపంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. వంద డెసిబెల్స్ దాటిన సైలెన్సర్లు వినియోగించడం చట్టరీత్యా నేరమని, అలాంటి సైలెన్సర్లు విక్రయించేవారు కూడా శిక్షకు గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 సీఐలు శ్రీను, ఎన్.సాయి తదితరులు పాల్గొన్నారు.

సిటీ సెంట్రల్ పార్కు వద్ద భారీ వాహనాలకు చెక్



బస్సులు, భారీ వాహనాలు లేకపోవడంతో విలాసంగా రోడ్డు

డాబాగార్డెన్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని సిటీ సెంట్రల్ పార్కు చుట్టూ భారీ వాహనాలు, బస్సులు, మినీ వ్యాన్‌ల పార్కింగ్ సమస్యకు ఎట్టకేలకు తెరపడింది. ఇక్కడ ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తేవి. ఈ నేపథ్యంలోని సిటీసెంట్రల్ పార్కు చుట్టూ స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. టూ టౌన్ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీలక్ష్మి నేతృత్వంలో మంగళవారం సిటీ సెంట్రల్ పార్కు నుంచి గుడివాడ గురునాథరావు సర్కిల్‌తో పాటు ఆయా ప్రాంతాల్లో భారీ వాహనాలు ఉన్న చోట డ్రైవ్ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ భారీ వాహనాలు రోడ్డుపై నిలపరాదని ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆ ప్రాంతంలో రోడ్డును ఖాళీ చేయించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విదేశీ, డిఫెన్స్ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎక్సైజ్ అధికారులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ ఉంచి, విక్రయిస్తున్న విదేశీ, ఇతర రాష్ట్రాలు, డిఫెన్స్ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని పోలీసులకు అప్పగించారు. మహారాణిపేట స్టేషన్‌లో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. అల్లిపురం అచ్చెయ్యమ్మపేటకు చెందిన నానబిల్లి గణేశ్వరరావు ఇతర రాష్ట్రాలు, డిఫెన్స్, విదేశీ మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో క్రైమ్ సీఐ బి.జగదీశ్వరరావు, ఎస్ఐలు గణేశ్వరి, వేణు, సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో గోవా, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, డిఫెన్స్‌కు చెందిన సుమారు 75 మద్యం సీసా లు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. వీటిని తన ఇంట్లో నిల్వ ఉంచి పరిచమున్న వారికి విక్రయిస్తుంటానని నిందితుడు తెలిపాడు. తన మేనల్లుడు లక్ష్మణ్ అవినాష్ ద్వారా విదేశీ మద్యాన్ని తెస్తున్నాడన్నారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

'వేతన బకాయిలివ్వరేం'?



ధర్నా చేస్తున్న కేజీహెచ్ సెక్యూరిటీ గార్డులు

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు 3 నెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్వీ కుమార్ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ సునీతను కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట సెక్యూరిటీ గార్డులు మంగళవారం సాయంత్రం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేజీహెచ్‌లో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి కార్మికులను కాంట్రాక్టర్ దోచుకుంటున్నారని ఆరోపించారు. జీవో ప్రకారం సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు చెల్లించకుండా కేవలం రూ.9,090లు మాత్రమే ఇస్తున్నారని, అవి కూడా సకాలంలో చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ కూడా సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. అనంతరం కార్మిక శాఖాధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుబ్బారావు, విశాఖ జిల్లా హాస్పిటల్స్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ జాయింట్ సెక్రటరీ కర్రి చంద్రశేఖర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మాధవధారలో వైన్ షాప్ కేటాయింపు రద్దు చేయాలి: టీడీపీ



ప్లకార్డులు చూపుతూ నాయకుల నిరసన

మాధవధార, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి); మాధవధారలో వైన్ షాప్ వద్దంటూ మంగళవారం టీడీపీ నాయకులు నిరసనకు దిగారు. బస్టాపు ఎదుట కొత్తగా ప్రతిపాదించిన షాపు ఏర్పాటును అడ్డుకున్నారు. దుకాణం ఫ్లెక్సీలను నాయకులు తొలగించారు. 48ఎ బస్టాపు ఎదుట ఉన్న బిల్డింగ్ వద్ద ప్లకార్డులు పట్టి నిరసన తెలిపారు. అనంతరం మాధవధార ఎక్సైజ్ కార్యాలయం అడిషనల్ కమిషనరు సి.హెచ్.మహేష్, స్థానిక ఎక్సైజ్ సిఐ చంద్రశేఖర్‌కు వైన్ షాప్ అనుమతులు రద్దు చేయాలని వినతి పత్రం అందించారు. ప్రశాంతమైన మాధవధారలో వైన్ షాప్ వద్దన్నారు. కార్యక్రమంలో 50వ వార్డు టీడీపీ అధ్యక్షుడు వరప్రసాద్, వార్డు కమిటీ నాయకులు, డీవైఎఫ్ఐ నుంచి శ్రావణ్ తదితరులు నిరసనలో పాల్గొన్నారు.

నాలుగు దశాబ్దాల తరువాత అపూర్వ కలయిక..



సత్కారం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒకేచోట కలిసి చదువుకున్నవారంతా నాలుగు దశాబ్దాల తరువాత కలుసుకున్నారు. ఒకరినొకరు చూసుకుంటూ...ఏరా...నువ్వే...నా...నేనా...మరిచిపోయా....లేదు...ఎలా...ఉన్నావ్...ఎంతలా..మారిపోయావూ...అంటూ అప్పటి అపూర్వమైన స్మృతులను నెమరువేసుకున్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డు ఎంసీయూపీ స్కూల్ 1975-1982, 1983 బ్యాచ్‌ల విద్యార్థులంతా ఒక దగ్గర కలుసుకున్నారు. తమకు పాఠాలు నేర్పి, తమ ఎదుగుదలకు దోహదపడిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పార్వతి, ఉషారాణి, విజయలక్ష్మి, జోస్పిన్, సీతారామలక్ష్మి, రోజాలను ఆత్మీయంగా సన్మానించారు. చదువుకునే సమయంలో వారంతా చేసిన అల్లరి...ఆటపాటలు.. ఉపాధ్యాయులతో పంచుకుని ఒక్కసారిగా అప్పటి రోజులకు వెళ్లిపోయారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను, చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఎన్నటికీ మరవరాదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

మార్గశిర ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి పద్మజ. ఈవో కె.శోభారాణి

జగదాంబ కూడలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట వద్ద కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం ఆలయం వద్ద పందిరిరాటను భక్తి శ్రద్ధలతో ఏర్పాటు చేశారు. ఏటా ఉత్సవాల నిర్వహణ కోసం కార్తీక శుద్ధ ఏకాదశి రోజున ఆలయం వద్ద పందిరి రాట వేయడం ఆనవాయితీ. దీనిలో భాగంగా దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి పద్మజ, దేవస్థాన ఈవో కె.శోభారాణిలతో వేద పండితులు రాటముహూర్తం పూజలు చేయించారు. డిసెంబరు 2 నుంచి 30 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. రాట వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ఇంజనీరు రమణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు... ఉన్నా లేనట్టే!

... 5వ పేజీ తరువాయి

1,700 కెమెరాల్లో 500 వరకూ పనిచేయడం లేదని అధికారులు అంచనా వేస్తున్నారు. బీచ్‌రోడ్డుతోపాటు నగరంలోని కీలక ప్రాంతాలు, కూడళ్లలోని సీసీ కెమెరాలు తుప్పుపట్టిపోగా, మరికొన్నిచోట్ల బోల్ట్‌లు ఊడి, స్టాండ్‌లు విరిగి గాలిలో వేలాడుతున్నాయి. ఏ క్షణానైనా వైరు తెగి కింద నుంచి వెళ్లే వాహనచోదకులపైనా, పాదచారులపైనా పడిపోయేలా ఉన్నాయి.

నేరాల నియంత్రణ..
ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రభావం

నగరంలో సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడం నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రభావం చూపుతోంది. ఎక్కడైనా చోరీ, దోపిడీ జరిగినా, కిడ్నాప్‌లు, మిస్సింగ్ కేసులు నమోదైతే వాటికి సంబంధించిన ఆధారాలను సమీపంలోని సీసీ కెమెరాల నుంచి పోలీసులు సేకరించేవారు. దీనివల్ల కేసుల ఛేదన సులభమయ్యేది. అలాగే ఎక్కడైనా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడినా, రోడ్డు ప్రమాదాలు జరిగినాసరే పోలీసులు కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించి సమీపంలోని ట్రాఫిక్ సిబ్బందిని అప్రమత్తం చేసి అక్కడకు పంపించేవారు. దీనివల్ల సత్వరం ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసే అవకాశం ఉండేది. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలు 30 శాతానికిపైగా పనిచేయకపోవడం పోలీసులకు తలనొప్పిగా మారింది. సీసీ కెమెరాల నిర్వహణపై పోలీస్, జీవీఎంసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టిసారిస్తేగానీ గంజాయి రవాణా, వినియోగం, ఈవ్‌టీజింగ్, చోరీలు, నేరాల నియంత్రణకు వీలుంటుందని సిబ్బంది అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

డిసెంబరు 31 నాటికి సమస్య పరిష్కరిస్తాం

శంఖబ్రతబాగ్చి, నగర పోలీస్ కమిషనర్

నగరంలో సీసీ కెమెరాల మరమ్మతు, కొత్త సీసీ కెమెరాల ఏర్పాటుపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో ఇటీవలే చర్చించడం జరిగింది. సీసీ కెమెరాలన్నీ పనిచేసేలా చేయడంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడానికి జీవీఎంసీ కమిషనర్ అంగీకరించారు. వచ్చేనెల 31వ తేదీ నాటికి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని కూడళ్లలో ప్రమాదాల నియంత్రణకు రోడ్ల డిజైన్‌లో మార్పులు కూడా చేస్తామని హామీ ఇచ్చారు.

సాకారం కాని సీ ప్లేన్

... 5వ పేజీ తరువాయి

రాశారు. సీ ప్లేన్‌కు అవసరమైన జెట్టీ నిర్మిస్తామని ప్రకటించారు. అప్పటికే పోర్టు క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం సగం పూర్తిచేసింది. ఇప్పుడైతే ఆ టెర్మినల్ ఆపరేషన్‌కు సిద్ధంగా ఉంది. క్రూయిజ్‌లు ఎలాగూ రావడం లేదు. కనీసం సీ ప్లేన్ అయినా నడిపితే బాగుంటుంది. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ, శ్రీశైలం, హుస్సేన్ సాగర్ (హైదరాబాద్), చిలకా సరస్సు (ఒడిశా), తిరుపతి వంటి ప్రాంతాలకు డిమాండ్ ఉంటుంది.

సీ ప్లేన్ నీటిపైనా, భూమిపైనా ల్యాండ్ అవుతుంది. అలాగే టేకాఫ్ ఎక్కడి నుంచైనా తీసుకోగలుగుతుంది. లోకల్ టూరిజం కింద విశాఖపట్నం నుంచి రుషికొండ, భీమిలి, అరకులోయ, లంబసింగి, పొరుగునే ఉన్న అరసవిల్లికి కూడా నడపొచ్చు. అయితే జిల్లా పర్యాటక శాఖ అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. ప్రభుత్వం కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ఇక్కడ పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ పోస్టు, ఏపీటీడీసీలో డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఈ బాధ్యతలన్నీ ఒక్కరికే అప్పగించారు. ఆ శాఖను సంస్కరించాలని ప్రజా ప్రతినిధులు కూడా ఆలోచించడం లేదు.

ఉక్కుకు ఐరన్‌ఓర్ కొరత

... 5వ పేజీ తరువాయి

టన్నుకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు రవాణా వ్యయం పెరుగుతుంది. ఇది ప్లాంటుకు ఆర్థిక భారం. కొంతకాలంగా బైలదిల్లా నుంచి జిందాల్, మిట్టల్ సంస్థలు పెద్దఎత్తున ఐరన్‌ఓర్‌ను కొనుగోలు చేసి తరలించుకుపోతున్నాయి. ఆయా యాజమాన్యాలు ఉన్నత స్థాయిలో లాబీయింగ్ చేయడంతో విశాఖ స్టీల్‌ను పక్కనపెట్టి, వారికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. బైలదిల్లాలోని ఐరన్‌ఓర్ నాణ్యమైనది కావడంతోనే డిమాండ్ ఎక్కువ. దీనికితోడు రైల్వే అధికారులు కూడా పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. ఉక్కు కర్మాగారానికి ఐరన్‌ఓర్ రవాణా చేసేందుకు అవసరమైనన్ని ర్యాకులు (గూడ్సు రైళ్లు) కేటాయించడం లేదు. రోజుకు ఐదు ర్యాకులు పంపాల్సి వస్తే మూడే ఇస్తున్నారు. ఇది కూడా సమస్యగా మారింది.

సెయిల్‌లో విలీనమే పరిష్కారం

విశాఖ ఉక్కు సమస్యల నుంచి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపడం లేదు. సొంత గనులు కేటాయించడం లేదు. కనీసం సొంత గనులున్న స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో విలీనం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సెయిల్‌కు నాలుగు ప్రాంతాల్లో ఐరన్‌ఓర్ గనులున్నాయి. అందులో విలీనం చేస్తే విశాఖ స్టీల్‌కు సమస్య ఉండదు. సెయిల్ గనుల నుంచి ఐరన్‌ఓర్ వస్తుంది.

హెచ్ఎంలకు భారంగా పాఠశాలల నిర్వహణ

... 5వ పేజీ తరువాయి

ప్రధానోపాధ్యాయులు గత పాలకులకు విన్నవించుకున్నారు. ఆ మేరకు పాఠశాలల విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని గత ప్రభుత్వంలో విద్యా శాఖా మంత్రిగా పనిచేసిన బొత్స సత్యనారాయణ చెప్పడంతో హెచ్ఎంలు ఆ విషయం మరచిపోయారు.

గ్రాంటు విడుదల చేసిన ప్రభుత్వం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని 559 పాఠశాలలకు రూ.91,95,000 గ్రాంటు విడుదలైంది. 2024-25 విద్యా సంవత్సరానికి పూర్తి గ్రాంటు రూ.1,83,90,000. 30 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఏడాదికి రూ.10 వేలు, 30-100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.25 వేలు, 100-250 మంది విద్యార్థులు ఉన్నట్టయితే రూ.50 వేలు, 250 మంది నుంచి 1000 మంది వరకు రూ.75 వేలు, 1000 మంది, అంతకంటే ఎక్కువ ఉన్న పాఠశాలలకు రూ.లక్ష గ్రాంటు కింద విడుదల చేస్తారు. పాఠశాలలో విద్యుత్ బిల్లులు, తాగునీటికి ఆ మొత్తం ఖర్చు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. అయితే పాఠశాలల్లో ఫ్యాన్లు, లైట్లు పెరగడం, ఇంకా తాగునీటి కోసం మోటారు నిర్వహణ నేపథ్యంలో విద్యుత్ బిల్లులు భారీగా వస్తున్నాయి. దాంతో మిగిలిన ఖర్చులకు స్కూలు గ్రాంటు సరిపోదని హెచ్ఎంలు వాపోతున్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. తాజాగా విడుదల చేసిన గ్రాంటు నుంచి విద్యుత్ బిల్లుకు కొంత మొత్తం వెచ్చించాలి. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు పాత బకాయిలు చెల్లించిన తరువాతే మాత్రమే ప్రస్తుత బిల్లు చెల్లించాలి. బకాయిలు చెల్లించాలంటే ప్రస్తుత గ్రాంటు సరిపోదు. పైగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వాడిన విద్యుత్‌కు మాత్రమే బిల్లు చెల్లించాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో విద్యుత్ బిల్లుల విషయంలో హెచ్ఎంల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఈ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని లేకపోతే పాఠశాలలకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వస్తాయని అంటున్నారు.

☛ సంక్షిప్తంగా..

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని నగర శాఖ గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి కేవీపీ ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 14న జాతీయ పతాకావిష్కరణ, చాచా నెహ్రూ జయంతి వేడుకలు, 15న పుస్తక ప్రదర్శన, నూతన సభ్యత్వ స్వీకరణ, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు 'అడవులు-ఉపయోగాలు' అనే అంశంపై, 9, 10 తరగతుల విద్యార్థులకు 'విద్యపై మానసిక ఒత్తిడి' అంశంపై వక్తృత్వ పోటీలు, 16న 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'సెల్‌ఫోన్ వినియోగం- విద్యార్థులపై ప్రభావం' అంశంపై వ్యాస రచన పోటీలు, 17న గ్రంథాలయ ఉద్యమ నేతల స్మరణ, 18న ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు, 19న విద్యార్థినులకు మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీ, 20న ముగింపు సభ, విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు



అభిషేకం చేస్తున్న భక్తులు

వెంకోజీపాలెం,నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోనిశ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర దేవాలయంలో వేంచేసి ఉన్న లింగేశ్వరుడు, నాగదేవత సహిత సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలభాస్కర శర్మలు పాలు, పెరుగు, నెయ్యి, తేనే, పంచదార, పసుపు, కుంకుమలతో స్వయంగా సుబ్రహ్మణ్యస్వామికి భక్తులతో అభిషేకాలు చేయించారు. తెల్లవారు జాము నుంచి అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ములాఖత్ కోసం క్యూ



రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న దృశ్యం

ఆరిలోవ. నవంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో గల ఖైదీలను కలవడానికి వారి బంధువుల అధిక సంఖ్యలో మంగళవారం వచ్చారు. ములాఖత్‌కు వచ్చిన వారంతా తొలుత రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు బారులు తీరారు. సుమారు 200 మంది వచ్చారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హైవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని(గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 34, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 30, క్యారెట్ 48 దొండకాయలు 36, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 55, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 42, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, క్యాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, క్యాప్సికం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	102
ఫారం ధర	122
విత్ స్కిన్	214
స్కిన్‌లెస్	224

కాలువల మరమ్మతు మాటే లేదు

» ఏళ్ల తరబడి నిర్లక్ష్యం » తుప్పలు, డెబ్రిస్‌తో నిండిపోయిన డ్రైనేజీలు » తీవ్ర దుర్గంధం, దోమల విజృంభణతో స్థానికుల ఇబ్బంది

ఆరిలోవ, నవంబరు 12 : జీవీఎంసీ జోన్-2 పరిధిలో ప్రధాన కాలువలకు మరమ్మతులు చేపట్టడం గురించి అధికారులు పట్టించుకోవవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాంతంలో గల కాలువల్లో దట్టంగా తుప్పలు పెరిగిపోవడం, స్థానికులు కొందరు నిర్మాణ వ్యర్థాలను వేస్తుండడంతో కాలువల్లో మురుగు నీరు ప్రవహించడానికి అవకాశం లేకుండా పోతోందని అంటున్నారు. దీనివల్ల తీవ్ర దుర్గంధం, విపరీతంగా దోమల సమస్య ఏర్పడుతోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే వర్షం వచ్చినప్పుడు మురుగునీరు రోడ్ల పైకి వచ్చి సమీపంలోని ఇళ్లల్లోకి దూసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డెబ్రిస్‌తో నిండిన ఇందిరానగర్‌లోని కాలువ

పాత డెయిరీ ఫారం ఆదర్శనగర్ పెట్రోల్ బంకు సమీపంలో గల ప్రధాన కాలువ ఇందిరా నగర్ వరకు ఉన్నది. అక్కడ ఇళ్ల నుంచి చేరే వాడుక నీరు అంతా ఈ కాలువ ద్వారా మురుగు నీరు డెయిరీ ఫారం గెడ్డలోకి చేరుతుంది. అయితే ఈ ప్రధాన కాలువకు ఏళ్ల తరబడి మరమ్మతు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారైంది. కాలువ పొడవునా ఏపుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉన్నాయి. అలాగే కొందరు డెబ్రిస్‌ను తెచ్చి ఇందులోకే పడేస్తుండడం పెద్ద సమస్యగా తయారైంది. దీని గురించి పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని ఈ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అలాగే 13వ వార్డులో గల పైనాపిల్ కాలనీలోని కాలువ పరిస్థితి కూడా దారుణంగా ఉంది. రీజియన్ సీడీ కార్యాలయం, ప్రాంతీయ శిశు సంవర్ధక శాఖ, మహిళా ప్రాంగణం వంటి కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. అయితే ఇక్కడి కాలువల్లో సంవత్సరాల తరబడి పూడిక తీయడంతో



తుప్పలతో నిండిన పైనాపిల్ కాలనీ ప్రధాన కాలువ

వ్యర్థాలు నిలిచిపోయింది. ఆ చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దుర్వాసన భరించ లేకపోతున్నామని, శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు, ఆయా కార్యాలయాల సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు సమస్యపై దృష్టి సారించి ఈ ప్రాంతంలో కాలువల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వెంకన్న ఆలయాలలో ఏకాదశి పూజలు

వెంకోజీపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని విష్ణు ఆలయాలన్నీ మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఎంవీసీ త్రిమూర్తిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామి వారి దర్శనానికి బారు లు తీరారు. అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ శర్మలు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలోదీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి టి.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావు తదితరులు పర్యవేక్షించారు.



వెంకన్న స్వామికి తులసి మాలల అలంకరణ



ఎంఎంటీసీ త్రిమూర్తిక ఆలయంలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు

కొత్త వెంకోజీపాలెంలోని రామాలయంలో వేంచేసి ఉన్న శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని వెంకన్నకు తులసి కల్యాణం జరిపారు. స్వామి వారిని తులసిమాలలతో నిండుగా అలంకరించారు. ఆలయ అర్చకులు కిషోర్‌శర్మ అభిషేకాలు, అర్చనలు జరిపారు. అనంతరం కార్తీక ఏకాదశిని వివరిస్తూ కార్తీక మాసంలో వచ్చే ఏకాదశిని ఉత్థాన ఏకాదశిగా పేర్కొంటారని, దీనిని ప్రబోధిని ఏకాదశి అని కూడా అంటారని చెప్పారు.

ఈ ఏకాదశి రోజున విష్ణుమూర్తి తన నాలుగు నెలల నిద్ర నుంచి మేల్కొంటారని, భక్తులందరూ ఉత్థాన ఏకాదశిని ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుతారని, విష్ణుమూర్తిని పూజిస్తారని, విష్ణుమూర్తితో పాటు తులసి మొక్కను పూజిస్తే కూడా చాలా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. లక్ష్మీ రూపమైన తులసిని విష్ణువు వివాహం చేసుకుంటాడని భక్తులకు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనే ధ్యేయం

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

సిరిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిర్మూలించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. మంగళవారం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో పారిశుధ్య మెరుగుదల, ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణపై ఆర్పీలు, శానిటేషన్ కార్యదర్శులకు జీవీఎంసీ నిర్వహించిన వర్క్‌షాప్‌లో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ రాష్ట్రానికి తలమానికమన్నారు. దేశంలోనే నాలుగో పరిశుభ్ర నగరంగా విశాఖ గుర్తింపు పొందిందన్నారు. విశాఖ నగరం నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్‌హెచ్‌జీ మహిళలు, శానిటేషన్ కార్యదర్శుల భాగస్వామ్యంతో 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, చిత్రంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో జీరో ప్లాస్టిక్, జీరోగార్బేజ్ దిశగా జీవీఎంసీ కార్యాచరణ రూపొందించిందన్నారు. అన్ని వార్డులలో అన్ని ప్రాంతాల్లో శత శాతం పారిశుధ్యం మెరుగుకు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ ఆర్.సోమన్నారాయణ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.నరేష్‌కుమార్, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, యుసీడీ పీడీ సత్యవేణి, జోనల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ కార్మికులు 'నమస్తే'లో నమోదు కావాలి

» జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ సంపత్‌కుమార్

వెంకోజీపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో గల సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధికి శ్రీకారం చుట్టే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణలో ప్రవేశపెట్టిన 'నమస్తే' పథకంలో కార్మికులు వెంటనే నమోదు కావాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ., గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) పథకంను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ఈ కార్యాచరణలో భాగంగా జీవీఎంసీలో ఉన్న సెప్టిక్ టాంక్ శుభ్రపరచడంలో ఇప్పటికే ఉన్న కార్మికుల గుర్తింపు ప్రక్రియ జీవీఎంసీ ప్రారంభించడం జరిగిందన్నారు.

ఇందుకోసం జీవీఎంసీ పరిధిలో ఉన్న సెప్టిక్ టాంక్ డ్రైవర్లు, హెల్పర్లు, ఎవరైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొంటున్నారో వారు సంబంధిత జోనల్ కార్యాలయాలలో తమ వివరాలను నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ పథకంలో నమోదు చేసుకోవాలని తెలియపరుస్తున్నామన్నారు.

ఈ పథకంలో నమోదు చేసుకోకుండా సెప్టిక్ ట్యాంక్ కార్యకలాపాలు చేయడం నిషేధించినట్టు పేర్కొన్నారు. సెప్టిక్ ట్యాంక్ కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రెట్టింపు వైద్య సహాయం అందించడం, వారి పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్ షిప్ ద్వారా ఉన్నత, మెరుగైన విద్యను అందించడం, అధిక సబ్సిడీ ద్వారా సెప్టిక్ టాంక్‌ను ఎస్‌యూవై ద్వారా అందించడం, భద్రతా, జీవనోపాధి కల్పించేలా శిక్షణ ఇవ్వడం ఈ పథకం ముఖ్య ఉద్దేశాలని పేర్కొన్నారు. అంతేకాకుండా వారికి పీపీఈ కిట్స్ అందించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు.

విదేశీ, డిఫెన్స్ మద్యం స్వాధీనం

ఎంవీపీ కాలనీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నిల్వ ఉంచి, విక్రయిస్తున్న విదేశీ, ఇతర రాష్ట్రాలు, డిఫెన్స్ మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడ్ని పోలీసులకు అప్పగించారు. మహరాణిపేట స్టేషన్‌లో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు.


అల్లిపురం అచ్చెయ్యమ్మపేటకు చెందిన నానబిల్లి గణేశ్వరరావు ఇతర రాష్ట్రాలు, డిఫెన్స్, విదేశీ మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో క్రైమ్ సీఐ బి.జగదీశ్వరరావు, ఎస్‌ఐలు గణేశ్వరి, వేణు, సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో గోవా, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, డిఫెన్స్‌కు చెందిన సుమారు 75 మద్యం సీసా లు పట్టుబడ్డాయి. వీటి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. వీటిని తన ఇంట్లో నిల్వ ఉంచి పరిచమున్న వారికి విక్రయిస్తుంటానని నిందితుడు తెలిపాడు. తన మేనల్లుడు లక్ష్మణ్ అవినాష్ ద్వారా విదేశీ మద్యాన్ని తెస్తున్నాడన్నారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ శాఖ అధికారులు

ప్రభుత్వ రంగ విద్యాసంస్థలను పరిరక్షించాలి : ఏయూ రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యావ్యవస్థను పటిష్ఠం చేయడంతో పాటు పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు అన్నారు. విద్యావిభాగం ఆధ్వర్యంలో యూజీసీ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఇన్ నెప్ 2020 ఇష్యూస్ కన్సర్న్స్ అండ్ చాలెంజెస్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం సమగ్రంగా, అనువుగా నిలుస్తోందన్నారు. విదేశీ విద్యా విధానానికి దగ్గరగా ఉందన్నారు. ప్రతి వ్యక్తికి ఇది అనువైన విధానంగా చెప్పవచ్చన్నారు. నూతన విద్యా విధాన అమల్లో ఎదురొస్తున్న సవాళ్లను చర్చించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు.ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో పలు విభాగాల ఆచార్యులు పాల్గొన్నారు.



సావనీర్ ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్, తదితరులు

14న తహశీల్దారు కార్యాలయం ఎదుట భారీ ధర్నా : సీపీఎం



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు మణి, వెంకటరావు, అప్పారావు తదితరులు

మద్దిలపాలెం, నవంబరు 12 : అధిక ధరలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ సీతమ్మధార తహశీల్దారు కార్యాలయం వద్ద ఈ నెల 14న భారీ ధర్నా నిర్వహించనున్నట్టు సీపీఎం నాయకురాలు పి.మణి చెప్పారు. నిత్యావసర వస్తువులు ధరలు అరికట్టి, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం శివాజీపాలెంలో సీపీఎం నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమన్న చంద్రబాబు నాలుగు నెలల్లోనే రూ.8 వేల కోట్లు భారం వేయడం సరికాదన్నారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని చెప్పి ఉద్యోగులను తొలగించడం దారుణమన్నారు. ప్రజలపై భారాలు మోపితే సీపీఎం పోరాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను వ్యతిరేకిస్తూ 14న ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలపతి, కుమారి, వెంకటరావు, అప్పారావు, కృష్ణారావుపాల్గొన్నారు.

మానసిక శక్తితో శాంతి, సంతోషం సాధ్యం

» బౌద్ధ బిక్షువు గీషే ట్సేవాంగ్ పుట్సుక్




బౌద్ధ బిక్షువు గీషే ట్సేవాంగ్ పుట్సుక్‌ను సత్కారం

వెంకోజీపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మనోబలంతో శాంతి, సంతోషం సాధించడం వీలవుతుందని బౌద్ధ బిక్షువు గీషే ట్సేవాంగ్ పుట్సుక్ అన్నారు. మంగళవారం ఏయూని సందర్శించిన ఆయన ఏయూ జర్నలిజం విభాగంలో విద్యార్థులనుద్దేశించి 'బౌద్ధం-ప్రపంచశాంతి' అంశంపై ప్రసంగించారు. ముందుగా బౌద్ధ బిక్షువు.. ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావును కార్యాలయంలో భేటీ అయ్యారు. హిందూ ధర్మం, బౌద్ధ ధర్మాల మధ్య సారూప్యతలు వివరించారు. వర్సిటీలను అనుసంధానం చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానాన్ని బౌద్ధ బిక్షువు తెలియజేశారు. భారత్‌లో పుట్టిన బౌద్ధం ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లుతోందని చెప్పారు.

అనంతరం జర్నలిజం విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు పాల్గొన్నారు. బౌద్ధ బిక్షువు గేషేట్సేవాంగ్ పుట్సుక్ మాట్లాడుతూ బాహ్య పరిసరాల కంటే అంతర్గత శక్తి మెదడు శాంతికి దోహదపడతాయన్నారు. శాంతి, సంతోషాలకు మన మనస్సే ప్రధాన కారకంగా నిలుస్తుందన్నారు. మానసిక శక్తి చాలా కీలకమని చెప్పారు. శాంతి అనేది ప్రతి ఒక్క వ్యక్తిపె ఆధారపడి ఉంటుందన్నారు. మీరు ఏం చేస్తున్నారు అనేది నిరంతరం తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ నిపుణుడు డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, యోగా విభాగం డాక్టర్ నిమాళి తక్షశిల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ సునీత సత్యనారాయణ

ఆరిలోవ, నవబంరు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో వరదల సమయంలో ముంపునకు గురైన ప్రాంతంలో 15 రోజుల పాటు శానిటరీ సిబ్బంది అందించిన సేవలు వెల కట్టలేనివని జీవీఎంసీ 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ప్రశంసించారు. మంగళవారం ఈ వార్డు పారిశుధ్య సిబ్బందికి ఆమె దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రామారావు, సూపర్ వైజర్ బంగారు నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలు జోడించే విధంగా సేవలు

» అమెరికన్ స్పేసెస్ సౌత్ ఏషియా హెడ్ క్యాథలిన్ ఫాక్స్



అమెరికన్ ప్రతినిధులను సత్కరిస్తున్న ఏయూ వీసీ

వెంకోజీపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వర్సిటీకి విద్యార్థులకు మరింత విలువను జోడించే విధంగా అమెరికన్ కార్నర్ పనిచేస్తుందని అమెరికన్ స్పేసెస్ సౌత్ ఏషియా హెడ్ క్యాథలిన్ ఫాక్స్ అన్నారు. మంగళవారం వీసీ డి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులతో వీసీ కార్యాలయంలో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా క్యాథలిన్ ఫాక్స్ మాట్లాడుతూ స్థానిక విద్యార్థులకు ఉపయుక్తంగా విభిన్న కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు. నేర్చుకోవడానికి, సంబంధాలను మెరుగుపరచుకోవడానికి, సమాచారాన్ని మార్పు చేసుకోవడానికి, సంస్కృతులను తెలుసుకోవడానికి ఒక కేంద్రంగా అమెరికన్ కార్నర్ నిలవాలని సూచించారు. ఏయూలో ఏర్పాటైన అమెరికన్ కార్నర్ నుంచి విద్యార్థి క్లబ్, కల్చరల్ షో, వర్క్‌షాప్‌లు వంటివి నిర్వహిస్తామని చెప్పారు. అమెరికా దౌత్యవేత్తలను ప్రత్యేకంగా ఇక్కడ విద్యార్థులతో అనుసంధానం చేసే విధంగా కార్యక్రమాలు పెంపొందించాలని సూచించారు. విద్యార్థులతోఅనుసంధానం, భాగస్వాములు అయ్యేవిధంగా వివిధ కార్యక్రమాల రూపకల్పన చేయాలని యూఎస్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ కేంద్రం పబ్లిక్ డిప్లమసీ అధికారి ఎమిలీయా స్మిత్ సూచించారు. విద్యార్థులను వాట్సాప్ కమ్యూనిటీ ద్వారా సమూహాలుగా ఏర్పాటు చేసి వారికి సమాచారాన్ని పంపే దిశగా పనిచేయాలని అన్నారు. అమెరికా విశ్వవిద్యాలయాల్లో విద్యకు సంబంధించి స్థానిక విద్యార్థులకుఅవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఏయూ వీసీ మాట్లాడుతూ అమెరికన్ కార్నర్ నుంచి నిర్వహించే కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఒక నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకుని క్రమ పద్ధతిలో వాటిని నిర్వహించే విధంగా సమన్వయం చేయాలని ఆయన సూచించారు.

'కోర్వా' ప్రధాన సమన్వయకర్తగా డాక్టర్ మూర్తి



సమావేశంలో పాల్గొన్న డాక్టర్ మూర్తి తదితరులు

వెంకోజీపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జాతీయ కాలనీ సంక్షేమ సంఘాల (కోర్వా) ప్రధాన సమన్వయకర్తగా విశాఖ జేఆర్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన 11వ జాతీయ కాలనీ సంక్షేమ సంఘాల (కోర్వా) సమావేశంలో ఎన్నిక చేపట్టారు. గత 8 ఏళ్లుగా కోర్వాకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనకు తాజాగా ఆ పదవి లభించింది. ఆయనతో పాటు విశాఖ కిర్లంపూడి కాలనీకి చెందిన ఎం.దుర్గాప్రసాద్ ఉపాధ్యక్షులుగా, విజయవాడ శ్రీనగర్ కాలనీకి చెందిన కేజీ రామారావు కార్యదర్శిగా, గుంటూరు మల్లికార్జునపురం కాలనీకి చెందిన నారా జోషి సంయుక్త కార్యదర్శిగా కోర్వా జాతీయ సమాఖ్యలోకి తీసుకున్నట్టు డాక్టర్ కేఎస్ఆర్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఫెర్వాస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఉదయ్ శిర్నామే గౌరవ సభ్యులుగా కొనసాగుతారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏపీ ఫెర్వాస్ నుంచి జాతీయ సమాఖ్య కోర్వాకు ఈ ఏడాది అత్యధికంగా 5 స్థానాలు కేటాయించడం జరిగిందని మూర్తి పేర్కొన్నారు.

వార్డుల్లో ఏఎంహెచ్‌వో తనిఖీ



పారిశుధ్య సిబ్బందికి సూచలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్‌కుమార్

ఆరిలోవ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12, 13 వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని జోన్-2 ఏఎంహెచ్‌వో కిశోర్ కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఈ వార్డుల్లో ఆకస్మికంగా సందర్శించారు. స్థానికులతో మాట్లాడి పారిశుధ్య పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీధి కాలువల్లో పూడికలు తీయాలని ఆదేశించారు. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో 13వ వార్డు శానిటరీ ఇన్సపెక్టర్ సువ్వారి రామారావు, 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బంగారురాజు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా కూటమి నేతలు

అక్కయ్యపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్లలో కూటమి నేతలకు డైరెక్టర్లుగా చోటు లభించింది. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గాఅనసూరి మధుసూదనరావు (భీమిలి, టీడీపీ), కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా మామిడి దుర్గారావు (భీమిలి, టీడీపీ), పొన్నాడ రమణారావు(టీడీపీ, పశ్చిమ), సనపల వరప్రసాద్ (టీడీపీ, నార్త్), ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొల్లూరు రూప(జనసేన), అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లుగా క్రిషన్ అంగ (టీడీపీ, గాజువాక)లకు పదవులు దక్కాయి. ఈ సందర్భంగా శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ మధుసూదనరావు బాధ్యతలు అప్ప గించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఇన్‌చార్జి కోరాడ రాజబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.



మధుసూదనరావును అభినందిస్తున్న చంద్రబాబు

నష్టాలను అధిగమించేందుకు కృషి: ఆర్టీసీ ఆర్ఎం

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో నష్టాలను అధిగమించేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని ఆర్ఎం బి.అప్పలనాయుడు అన్నారు. ద్వారకాకాంప్లెక్సులోని రీజనల్ మేనేజర్ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు రోజులో కొంత సమయాన్ని ఫీల్డులో ఉండి, బస్టాపుల్లోనికి ప్రైవేటు వాహనాలు రాకుండా చూడాలన్నారు. దీనివల్ల ఆక్యుపెన్సీ రేషియో పెరుగుతుందన్నారు. మెకానికల్ ఇంజినీర్లు గ్యారేజీల్లో నిత్యం పర్యవేక్షించాలన్నారు. డిప్యూటీ చీఫ్‌ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యానారాయణ, రాజశేఖర్, డిపోమేనేజర్లు ఎన్ అరుణకుమారి (మద్దిలపాలెం), వి.ప్రవీణ (గాజువాక), కె.సుధాకర్ (వాల్తేరు), కె.రాజశేఖర్ (సింహాచలం), పీబీఎంకే రాజు (మధురవాడ), తిరుపతి, వంశీ మోహిని పాల్గొన్నారు.



రాగి, ఇత్తడితో చేసిన పలురకాల వస్తువులు, సామగ్రి

మాస్టారి ఇల్లే మ్యూజియం

ఉపాధ్యాయుని ఇంట పురాతన కళాఖండాలు

ఇత్తడి, రాగి, తగరంతో చేసిన అరుదైన వంటపాత్రలు, పలు రకాల వస్తువులు

- గ్రామఫోన్, పాటల రికార్డులు, టెలిఫోన్లు, కిరోసిన్ లాంతర్లు
- మ్యూజియం ఏర్పాటే లక్ష్యమంటున్న మాస్టారు
- తాజాగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక
- సీఎం చంద్రబాబు చేతులమీదుగా పురస్కారం అందుకున్న గంగాధరరావు



గంగాధరరావు

వృత్తిరీత్యా ఆయనొక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. పురాతన వస్తువుల సేకరణ ఆయన ప్రవృత్తి. పేరు కొరుప్రోలు గంగాధరరావు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం పంచాయతీ పరిధిలోని బాపడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. మాస్టారి ఇల్లు కళాఖండాల భాండాగారం. ఇప్పటి తరానికి తెలియని, చూడని ఎన్నో వస్తువులు ఆయన నివాసంలో కనిపిస్తాయి. రాజుల కాలం నుంచి ఆంగ్లేయుల వరకు వాడిన వివిధ రకాల పనిముట్లు, సామగ్రి, వారి ఆహారపు అలవాట్లను భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఎన్నో రకాల వస్తువులను సేకరించారు. గంగాధరరావు ఈ ఏడాది రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై ఈ నెల 11వ తేదీన విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. - పరవాడ-ఆంధ్రజ్యోతి

పూర్వకాలంలో వంటపాత్రలు, ఇతర గృహోపకరణాలను చేతితో తయారుచేసేవారు. రాగి, ఇత్తడి, తగరం వంటి లోహాలతోపాటు మట్టితో కూడా రూపొందించేవారు. కాలక్రమేణా పింగాణి, స్టెయిన్‌లెస్ స్టీల్, జర్మన్ సిల్వర్ (అల్యూమినియం), ఫైబర్, ప్లాస్టిక్‌తో తయారుచేసిన వస్తువుల వాడకం పెరిగింది. దీంతో రాగి, ఇత్తడి, తగరంతో చేసిన గృహోపకరణాలు కనుమరుగయ్యాయి. అయితే గంగాదర్ మాస్టారు... పురాతన సామగ్రిని సేకరించడం హాబీగా మార్చుకున్నారు. కంచు గిన్నెలు, గ్లాసులు, చెంబులు, గోకరణాలతోపాటు గ్రామ్‌ఫోన్లు, వాటి రికార్డులు, కిరోసిన్ లాంతర్లు, పాత రేడియోలు, కర్ర గరిటెలు, తదితర వాటిని సేకరించి భద్రపరుస్తున్నారు. ప్రస్తుతం ఘన వస్తువులను గ్రాములు/ కిలోల్లో, ద్రవ వస్తువులను లీటర్లలో కొలుస్తున్న విషయం తెలిసిందే. కానీ ఐదారు దశాబ్దాల క్రితం వరకు ఘన వస్తువులను తూకం వేయడానికి ఇత్తడితో తయారుచేసిన కొలమానం పాత్రలను వినియోగించేవారు. వీటిని సేరు, వీశ, అర్ధ మణుగు, మణుగు అనేవారు. ధాన్యం కొలవడానికి వినియోగించే పరికరాలను గిద్ద, సోల, మానిక వంటి పేర్లతో పిలిచేవారు. ఇటువంటి ఎన్నో అరుదైన వస్తువులను ఆయన సేకరించి భద్రపరిచారు.

మాస్టారు సేకరించిన వస్తువుల్లో భోజనం చేసే కంచు గిన్నె సుమారు ఐదు కిలోల బరువు వుండడం విశేషం. అప్పట్లో అలంకరణ, పిల్లల ఆట వస్తువులు కలప, ఇత్తడితో తయారుచేసేవారు. 1932 నుంచి నాలుగు దశాబ్దాల క్రితం వరకు సినిమా పాటలు గ్రామఫోన్ రికార్డుల రూపంలో ఉండేవి. 1952లో వచ్చిన 'శ్రీరామ పాదుకల' సినిమా పాటల రికార్డు మొదలుకొని 78, 45, 33.5 ఆర్‌పీఎం రికార్డులు (ఎల్‌పీలు) సుమారు రెండు వేల వరకు ఉన్నాయి. ప్రముఖ గాయకులు ఘంటసాల, సుశీల,బాలసుబ్రహ్మణ్యం, జేసుదాసు, మహ్మద్‌రఫీ, ఆనంద్, జానకి, జమునా రాణి పాడిన పాటల క్యాసెట్లను సేకరించారు. గ్రామాలకు కరెంటు సదుపాయం లేని రోజుల్లో కిరోసిన్ లాంతర్లను వినియోగించేవారు. గంగాధరరావు మాస్టారు ఇటువంటి పలు రకాల లాంతర్లను సేకరించి భద్రపరిచారు.



దశాబ్దాల నాటి గ్రామఫోన్, టీవీ, రేడియో, టెలిఫోన్



ఇత్తడితో చేసిన వంటపాత్రలు, పూర్వం కాలం నాటి పాత్రలు

దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1959లో అమెరికా వెళ్లినప్పుడు అక్కడ చేసిన ప్రసంగం, పేపరు రికార్డులు, వెయ్యికి పైగా టేపు క్యాసెట్లు ఉన్నాయి. పెద్ద పెద్ద రేడియోలు, టెలిఫోన్లు, టైప్‌మిషన్లు, కత్తులు, కొరడాలను సేకరించి భద్రపరుస్తున్నారు. వెయ్యి సంవత్సరాల క్రితం నాటి తాళపత్రాలు, బ్రిటిష్‌కాలం నాటి ఉత్తరాలు, 600 ఏళ్ల నాటి జమిందారి రాజముద్ర, వందేళ్ల నాటి రంగం పెట్టె, చేతితో తయారుచేసిన రాజుల కాలం నాటి నెమళ్లు, తూనికల పరికరాలను సేకరించి నేటి తరం పిల్లలకు తెలిసేలా అప్పుడప్పుడు ప్రదర్శిస్తున్నారు.

పురాతన వస్తువులతో మ్యూజియం

మన పెద్దలు, పూర్వీకులు ఉపయోగించిన పలు రకాల వస్తువులను సేకరించాలన్నది నా లక్ష్యం. నాడు వాడిన వస్తువులకు ఓ ప్రత్యేకత, ప్రయోజనం ఉండేవి. పర్యావరణ హితంగా తయారుచేసేవారు. ఇప్పుడన్నీ ప్లాస్టిక్, కెమికల్స్, హానికర పదార్థాలతో తయారవుతున్నాయి. ఆ తేడాను తెలియజేయాలన్న ఉద్దేశంతో పురాతన వస్తువుల సేకరణ ప్రారంభించాను. చాలా ఏళ్ల క్రితం వినియోగించిన కొన్ని రకాల వస్తులను సేకరించడానికి డబ్బులు వెచ్చిస్తున్నాను సేకరించిన వస్తువులను భద్రపరచడానికి మా ఇంట్లో ప్రత్యేకంగా ఒక గదిని కేటాయించాను. ఇంకా చాలా రకాల వస్తువులను సేకరించాలని అనుకుంటున్నాను. పురాతన వస్తువులతో త్వరలో ఒక మూజియం ఏర్పాటు చేస్తాను.

- కొరుపోలు గంగాధరరావు, ఉపాధ్యాయుడు

బుచ్చెయ్యపేట 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్ రాము మృతి



రాము (ఫైల్ ఫొటో)

చోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం 'ఆంధ్రజ్యోతి' రిపోర్టర్‌గా పనిచేస్తున్న సిరిగిరిశెట్టి రాము (58) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన రాము 'ఆంధ్రజ్యోతి' పునఃప్రారంభం నుంచి రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తెల్లవారు జామున వడ్డాదిలోని తన స్వగృహంలో కన్నుమూశారు. రాముకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాము కుటుంబాన్ని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, ఎంపీడీవో విజయలక్ష్మి, 'ఆంధ్రజ్యోతి' సిబ్బంది, రిపోర్టర్లు, ఏపీడబ్ల్యూజే ప్రతినిధులు పరామర్శించి సంతాపం తెలిపారు.

బ్యాడ్మింటన్ కోచ్ ఆత్మహత్య



రాజేష్‌కుమార్ (ఫైల్)

మర్రిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. న్యూకరాసలో మంగళవారం జరిగిన ఘటనకు సంబంధించి పోలీ సులు, తెలిపిన వివరాల ప్రకారం.. మూనురు రాజేష్‌కుమార్ (35) గాంధీబొమ్మ సమీపంలో ఉంటున్నాడు. ఇండోర్ స్టేడియంలో బాడ్మింటన్ కోచ్‌గా పనిచేస్తున్నాడు ఇటీవల దంపతుల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ కోచింగ్‌కు కూడా వెళ్లలేదు. అతడి శిష్యుడు తండ్రితో కలిసి మంగళవారం కోచ్ ఇంటికి వచ్చి పిలిచాడు. స్పందించకపోవడం, తలుపులు తీసి ఉండడంతో లోపలకు వెళ్లేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీమ్ వివరాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, మృతుడి తల్లి నూకాలమ్మ ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు నేతృత్వంలో ఎస్ఐ రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

వియత్నాంకు విస్తరించిన 'గీతం' అధ్యాపకుడి సేవలు

హైదరాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్‌లోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి కృత్రిమ మేథ (ఏఐ)పై ఈనెల 10 నుంచి 24 వరకు అతిథి ఉపన్యాసాలు ఇవ్వడానికి వియత్నాం హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలకు వెళ్లారు. గతంలో వియెన్ డాంగ్ కళాశాల విద్యార్థులకు జావా, ఫ్లట్టర్‌లో ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. బోధనా బాధ్యతలతో పాటు, సైబర్ సెక్యూరిటీపై పరిశోధన చేస్తున్నారు. సైబర్‌సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్‌లో పీహెచ్‌డీని చేసిన ఆయన 21 పాఠ్య పుస్తకాలు రాశారు. ఐ ట్రిపుల్‌ఈ సీనియర్ సభ్యుడిగా, 2024 ఐ ట్రిపుల్ ఈ కంప్యూటర్ సొసైటీ బెంగళూరు కార్యనిర్వాహక సభ్యుడిగా కీలక భూమిక పోషిస్తున్నారు. అదే చాప్టర్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీకి కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నారు.







నీటిసంఘాల ఎన్నిక ప్రక్రియపై అవగాహన ఉండాలి

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలని, అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 23న జరగనున్న నీటిసంఘాల ఎన్నికల నిర్వాహణ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ఈవో, ఏఈవో, పీవో, ఏపీవోలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సున్నితమైన అంశమని, ప్రతి దశలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఏకగ్రీవం లేదా చేతులు ఎత్తే పద్ధతిలో ఎన్నిక ఉంటుందని, రైతులకు అవగాహన కల్పించి, సందేహాలను నివృత్తి చేయాలన్నారు. భీమిలి, ఆనందపురం, పెందుర్తి, పద్మనాభం మండలాల పరిధిలోని 29 నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. మాస్టర్ ట్రైనర్లు వి.చిన్నంనాయుడు, ఆర్.సురేష్‌కుమార్ వివిధ అంశాలను వివరించారు. నోడల్ అధికారి జె.స్వామినాయుడు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, నీటిపారుదలశాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

యారాడలో బంగారు వర్ణంలో నాగుపాము



సింధియా, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): యారాడ డాల్ఫిన్స్ నోస్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం బంగారం రంగు నాగుపాము కనిపించింది. నేవీ అధికారి ఒకరు పార్కింగ్ షెడ్డు నుంచి తన కారును బయటకు తీసేందుకు ఐదు గంటల సమయంలో వెళ్లగా చీకటిలో మెరుస్తూ ఏదో కదులుతున్నట్టు కనిపించింది. దగ్గరకు వెళ్లి చూసేందుకు యత్నించగా బుస కొడుతూ నాగుపాము పడగ ఎత్తింది. వెంటనే ఆయన వెనక్కి వచ్చేశారు. స్థానికులు స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ చేయగా, ఆయన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా దానిని పట్టుకున్నారు. దీనిపై నేవీ అధికారి మాట్లాడుతూ, గతంలో తాను అటవీ ప్రాంతంలో పనిచేశానని, ఈ నాగుపాము బంగారం రంగులో మెరుస్తున్నదని, అరుదైన జాతికి చెందినదని, అటవీ అధికారులకు అప్పగించాలని నాగరాజుకు సూచించారు. స్నేక్ క్యాచర్ నాగరాజు మాట్లాడుతూ, తాను ఇప్పటివరకూ సుమారుగా పది వేల పాములు పట్టానని, ఎప్పుడూ ఇలా బంగారం రంగులో ఉన్న నాగుపామును చూడలేదని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అది పడగ విప్పినప్పుడు మెడ, పడగ మొత్తం బంగారం రంగులో మెరిసిపోతున్నదని, పడగ కింది భాగం నామం కూడా మూసుకుపోయేలా బంగారం రంగు కప్పేసిందని వివరించారు. ప్రస్తుతం పామును తన దగ్గరే పెట్టెలో ఉంచానని, అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తానని చెప్పారు. ఇలాంటివి శేషాచలం అడవుల్లో కనిపిస్తాయన్నారు.

నేడు అప్పన్న సన్నిధిలో చిలుకు ద్వాదశి

సింహాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశిని క్షీరాబ్ది ద్వాదశి లేదా చిలుకుద్వాదశి అని వ్యవహరిస్తారు. ఈ ఉత్సవాలకు సింహాద్రి అప్పన్న ఆలయం సిద్ధమయింది. ఉత్సవానికి అవసరమైన సంబారాలను అనకాపల్లికి చెందిన 'ఆడారి' కుటుంబీకులు సమకూర్చడం అనవాయితీ. బుధవారం మధ్యాహ్నం స్వామివారి పవళింపు సేవ అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో ద్వాదశి ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

రేపటి నుంచి విశాలాంధ్ర పుస్తక మహోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు

జగదాంబ కూడలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాలాంధ్ర పుస్తక మహోత్సవం ఈ నెల 14న టర్నర్ చౌల్ట్రీ ప్రాంగణంలో ప్రారంభమవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. బుక్ హౌస్ మేనేజరు పి.ఎ.రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజుతో కలిసి మంగళవారం ఆయన వివరాలు తెలియజేశారు. మహోత్సవాన్ని జీవీఎంసీ కమిషనర్ పి.వసంతకుమార్ ప్రారంభిస్తారన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి, మాజీ వీసీ ఆచార్య బి.బాలమోహన్‌దాస్, హిమాంసు బుక్ డిపో అధినేత కేవీఎస్‌కే ప్రసాద్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు పాల్గొంటారన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భోగాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖ జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగికి చెందిన కర్రి ఆదిలక్ష్మి (58) విజయనగరం మహారాజ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఏఎస్ఐ రాజు తెలిపారు. తల్లీ కొడుకులు కర్రి ఆదిలక్ష్మి, కర్రి సూరిబాబు ద్విచక్రవాహనంపై ఈనెల 6న భోగాపురం వచ్చారు. అనంతరం సర్వీస్ రహదారిలో వెళ్తున్నారు. సవరవల్లి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో కర్రి సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందగా, ఆదిలక్ష్మిని విజయనగరం తరలించారు. ఏఎస్ఐ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ ఫిర్యాదుల అథారిటీ చైర్మన్‌గా వీర్రాజు

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ ఫిర్యాదుల అథారిటీ ఛైర్మన్‌గా విశ్రాంత జిల్లా జడ్జి వై.వీర్రాజును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వీర్రాజు మూడేళ్లపాటు పదవిలో ఉంటారు. ఇంతవరకూ పనిచేసిన విశ్రాంత అదనపు ఎస్పీ ఎ.వరప్రసాదరావు రాజీనామా చేశారు.

సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

» మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల నిరసన

సిరిపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నోటికి గుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎండీఎం యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు భవాని, జి.మంగశ్రీ మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, వేతనాలు, మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, అక్షయ పాత్రలో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రాగి జావ వండినందుకు అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు పెంచలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. నిరసన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, నాయకులు వరలక్ష్మి, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.



నోటికి గుడ్డ కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

కడుపునొప్పి తాళలేక బాలుడి ఆత్మహత్య



రాజేష్‌కుమార్ (ఫైల్)

గోపాలపట్నం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రేటర్ 89వ వార్డు ఎల్లపువానిపాలెం గ్రామానికి చెందిన ఇల్లపు కుమారి ఇద్దరు కుమారులతో నివసిస్తోంది. భర్త చనిపోవడంతో విమానాశ్రయంలో కాంట్రాక్టర్ వద్ద దినసరి కూలీగా పనిచేస్తుంది. ఈమె ఇద్దరు కుమారులు ఎల్లపువానిపాలెం ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. కాగా మంగళవారం ఉదయం కుమారి విధులకు, చిన్నకుమారుడు పాఠశాలకు వెళ్లాడు. పెద్దకుమారుడు నిఖిల్ ఇంటి వద్దే ఉండిపోయాడు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిఖిల్‌తో పాటు చదువుతున్న మిత్రులు నిఖిల్ ఇంటికి వచ్చారు. ఎంత పిలిచినా తలుపుతీయకపోవడంతో బలంగా తోయడంతో తెరుచుకున్నాయి. అప్పటికే ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని వేలాడుతున్న నిఖిల్‌ను చూసి భయాందోళనతో స్థానికులకు, మృతుడి తల్లికి సమాచారం అందించగా ఆమె ఇంటికి చేరుకుని బోరున విలపించింది. తన కుమారుడికి కడుపునొప్పిగా ఉండడంతో పాఠశాలకు వెళ్లలేదని, ఇదే కారణంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులకు తెలిపింది. గోపాలపట్నం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్రాష్ట్ర చోరీ ముఠా సభ్యుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న వస్తువులతో పోలీసులు

గాజువాక, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముఠా ధార్ గ్యాంగ్ సభ్యుడిని పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక స్టేషన్‌లో మంగళవారం ఏడీసీపీ మోహనరావు వివరాలు వెల్లడించారు. శివాజీనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి గత నెల 16న తిరుపతి వెళ్లాడు. ఈనెల ఒకటో తేదిన ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో వాచ్‌మన్ సమాచారం ఇచ్చాడు. దీంతో అతను వచ్చి చూడగా ఇంట్లో బంగారు గొలుసు, నల్లపూసలు, నాలుగు జతల చెవిదిద్దులు, వెండి గ్లాసులు చోరీకి గురయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి చోరీ చేసింది మధ్యప్రదేశ్‌కు చెందిన ముఠాధార్ గ్యాంగ్‌గా గుర్తించారు మంగళవారం ఉదయం కూర్మన్నపాలెం వద్ద సహదర్‌ను గుర్తించి అతడి నుంచి బంగారు గొలుసు, నల్లపూసలు, చెవిదిద్దులు, 3.75కేజీల వెండి వస్తువులను స్వాధీనం ఇతడిపై గతంలో గాజువాక, స్టీల్‌ప్లాంట్, పరవాడ స్టేషన్‌ల పరిధిలో కేసులున్నాయన్నారు. సమావేశంలో ఏసీపీలు డి.లక్ష్మణరావు, వెంకటరావు, సీఐ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకుని 30 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒడిశాకు చెందిన రాజన్ ఫైక్, బీహార్‌కు చెందిన జావేద్ అన్సారి గంజాయితో దొరికారని కేసు నమోదు చేసినట్టు జీఆర్పీ హౌస్ ఆఫీసర్ ధనుంజయనాయుడు తెలిపారు.